శనివారం
10-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 50
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

12న చైనా పర్యటనకు ఫిజీ ప్రధాని

బీజింగ్: సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఫిజీ ప్రధాని రబుకా ఈనెల 12 నుంచి 21వ తేదీ వరకు తమ దేశంలో పర్యటిస్తారని చైనా విదేశాంగ శాఖ శుక్రవారం ఒక ప్రకటన చేసింది. సంబంధాల పటిష్ఠతను రెండు దేశాలు కాంక్షిస్తున్నట్లు వెల్లడించింది. ఫిజీ ప్రధానికి తమ దేశం సాదర స్వాగతం పలుకుతోందని ప్రకటన పేర్కొంది. తమ బంధాన్ని పటిష్ఠపర్చుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగిస్తామని తెలిపింది. అదే సమయంలో పసిఫిక్ దీవుల ఫోరం విదేశాంగ మంత్రులు ఫిజీలో జరగబోయే వార్షిక సమావేశంలో 2050 కోసం వ్యూహాత్మక లక్ష్యాలు నిర్దేశించుకోనున్నారు.

సిసోడియా విడుదల

బెయిల్ మంజూరుచేసిన సుప్రీం కోర్టు

న్యూదిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టుకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన తీహార్ జైలు నుంచి 17 నెలల తర్వాత శుక్రవారం సాయంత్రం బయటకు వచ్చారు. దిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో గతేడాది

- మిగతా 2 లో

విద్యాసంస్థల్లో హిజాబ్‌లు ధరించొచ్చు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూదిల్లీ: కళాశాల క్యాంపస్‌లలో విద్యార్థులు హిజాబ్‌లు ధరించడాన్ని నిషేధిస్తూ ముంబైకి చెందిన ఓ ప్రైవేట్ కాలేజీ ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. హిజాబ్‌పై నిషేధం విధిస్తే మహిళా సాధికారత ఎలా సాధ్యపడుతుందని కళాశాల యాజమాన్యాన్ని కోర్టు ప్రశ్నించింది. హిజాబ్ ధరించేందుకు ముస్లిం విద్యార్థినులకు అనుమతించింది. ఈ కేసుపై గతంలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపైనా సుప్రీం స్టే

- మిగతా 2 లో

నీట్ పీజీ పరీక్ష వాయిదా కుదరదు

సుప్రీం

న్యూదిల్లీ: నీట్-పీజీ పరీక్ష వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ పరీక్ష వాయిదా వేసి విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టలేమని వ్యాఖ్యానించింది. దేశంలో వైద్య విద్య పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చేరేందుకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ తీర్పుతో షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 11న (ఆదివారం) ఈ పరీక్ష జరగనుంది. ఏడేళ్లుగా నీట్ పీజీ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్

- మిగతా 2 లో

ఆదివాసీల్లో వెలుగులు నింపుతాం

- గిరిజనుల అభివృద్ధి కోసం చైతన్యం 2.0 కార్యక్రమం
- ప్రపంచ ఆదివాసీ దినోత్సంలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఐదేళ్లలో నిర్దిష్ట ప్రణాళికతో ఆదివాసీల్లో పేదరికం రూపుమాపేందుకు కార్యాచరణ చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పేరుకు పథకాలు ఇవ్వడం కాకుండా వాటి ఫలితాలు ఇచ్చేలా ఉండాలని, ఆ విధంగా చేసే ప్రతి ఒక్క పనితో గిరిజనుల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొస్తామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో డోలీ మోతలు కనబడటం చాలా బాధగా ఉందని, గిరిజనుల అభివృద్ధి కోసం చైతన్యం 2.0 పేరుతో ఈరోజు నుంచే ప్రారంభిస్తామని ప్రకటించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో సీఎం

- మిగతా 2 లో

క్విట్ కార్పొరేట్

6లో

- రాష్ట్రవ్యాప్తంగా హోరెత్తిన నిరసనలు
- బహుళజాతి కంపెనీల దోపిడీపై రైతు, కార్మిక సంఘ నేతల ఆగ్రహం
- బడా బాబుల అక్రమ ఆస్తులు జాతీయం చేయాలని డిమాండ్
- వ్యవసాయ రంగ రక్షణకు ఐక్య ఉద్యమానికి పిలుపు

సహజ వనరులను కొల్లగొడుతూ, మరోపక్క పేద, మధ్య తరగతి వర్గాల శ్రమను దోపిడీ చేస్తూ దేశాన్ని పట్టిపీడిస్తున్న బహుళజాతి కంపెనీలను తరిమికొట్టాలని రైతు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. క్విట్ కార్పొరేట్ పేరుతో కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపులో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి.

వైసీపీకి మాజీల బైబై

- పార్టీ వీడిన రోశయ్య, దొరబాబు, మద్దాలి గిరి
- సొంత నియోజకవర్గాల్లో కొత్తవారు పాగా
- ఆళ్ల నాని రాజకీయాలకు దూరం
- మాజీ మంత్రులూ పక్కచూపులు!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికల ఓటమి నుంచి తేరుకునేలోపే వైసీపీకి వరుసవారీ షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు రాజీనామాల బాట పట్టడంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. వైసీపీలోని కాపు సామాజికవర్గం నేతల మౌనం... ఆ పార్టీని ఆందోళనకు గురిచేస్తోంది. ఇటీవల వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు కిలారు రోశయ్య (పొన్నూరు), మద్దాల గిరి (గుంటూరు వెస్ట్), పెండెం దొరబాబు (పిఠాపురం) పార్టీకి వరుస వారీగా రాజీనామాలు చేశారు. వారి సొంత నియోజకవర్గాల్లో ఇతర నేతలకు టికెట్లు ఇవ్వడం, వారు ఓటమి పాలయ్యాక కూడా ఇన్‌ఛార్జ్‌లుగానే కొనసాగుతుండటంతో రాజకీయ భవిష్యత్ కోసం ఈ ముగ్గురు మాజీలు పార్టీకి రాజీనామా చేసినట్లుగా ప్రచారం ఉంది. తాజాగా ఏలూరు జిల్లాకు చెందిన మరో కీలక నేత, మాజీ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వైసీపీ అధినేత జగన్‌కు ఆయన పంపిన రాజీనామా లేఖను మీడియాకు విడుదల చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆళ్ల నాని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎంగా పనిచేశారు. వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్‌తో ఆయన వెన్నంటి నడిచారు. ఇలాంటి నేత ఏకంగా పార్టీని వీడటంపై వైసీపీలో చర్చ

- మిగతా 2 లో

పెద్దిరెడ్డి భూ దందాపై న్యాయ విచారణ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూదందాపై న్యాయ విచారణ జరపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా భూ దందాలకు పాల్పడ్డారన్నారు. ఆయన ద్వారా భూములు కోల్పోయిన బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని నారాయణ సూచించారు. న్యాయవిచారణ జరిపితే పెద్దిరెడ్డి కుటుంబం భూ కుంభకోణాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. కాగా ఆయా రాష్ట్రాల్లోని గవర్నర్లు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని నారాయణ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి రూ.15 వేల కోట్లు అప్పుగానే ఇస్తోందని చెబుతూ...రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులిస్తే సరిపోదని, నిర్వాసితులకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు. ఏపీలో శాంతి భద్రతలను భూతద్దంలో పెట్టి చూడాల్సిన పని లేదన్నారు. అసెంబ్లీకి వెళ్లకుండా జగన్ దిల్లీకి ఎందుకు వెళ్లారని నారాయణ ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి

- మిగతా 2 లో

తేనీటి విందులో మోదీ, రాహుల్

పార్లమెంటులో ఆసక్తికర సన్నివేశం

న్యూదిల్లీ : పార్లమెంటు ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా అనేక మంది అధికార, విపక్ష నేతలు తేనీటి విందులో పాల్గొన్నారు. అనధికారికంగా జరిగిన భేటీలో మోదీ, రాహుల్ ఒకరినొకరు నవ్వుతూ పలకరించుకున్నారు. సభలో ఉప్పు, నిప్పుగా ఉండే ఈ అగ్ర నేతలిద్దరూ ఇలా ఒకేచోట కూర్చున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పార్లమెంటు ఆవరణలో సాయంత్రం 4 గంటల సమయంలో ఈ భేటీ జరిగింది. మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోఫాలో కూర్చోగా... పక్కనే కుర్చీలో రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులు వరుసగా కూర్చున్నారు.

ఎదురుగా మరో సీట్లో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా ఉన్నారు. ఈ భేటీకి సంబంధించి ఇతర వివరాలేవీ వెల్లడి కాలేదు.

స్వాతంత్ర్య వేడుకలపై ఉత్తర్వులు

విజయవాడలో చంద్రబాబు, కాకినాడలో పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై ఏపీ సాధారణ పరిపాలన శాఖ ప్రొటోకాల్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించే వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఉదయం 9 గంటలకు సీఎం ఆవిష్కరిస్తారని, జిల్లా స్థాయిలో మంత్రులు పతాకావిష్కరణ చేస్తారని తెలిపింది. ఈ మేరకు వేడుకల్లో పాల్గొనే మంత్రులు వివరాలను వెల్లడించింది. కాకినాడలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జాతీయ జెండాను ఎగురవేస్తారని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్

- మిగతా 2 లో



'వక్ఫ్' జేపీసీలో నలుగురు తెలుగు ఎంపీలు

న్యూదిల్లీ: వక్ఫ్ సవరణ చట్టం బిల్లుపై 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని నియమించారు. ఇందులో నలుగురు తెలుగు ఎంపీలకు అవకాశం లభించింది. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ(హైదరాబాద్), బీజేపీ ఎంపీ డీకే అరుణ (మహబూబ్‌నగర్), టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు(నరసరావుపేట), వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి(రాజ్యసభ) సభ్యులుగా ఉంటారు. వక్ఫ్ చట్టంలో మార్పులు తెచ్చే ఉద్దేశంతో రూపొందించిన సవరణ బిల్లును గురువారం మోదీ ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. పరిశీలన కోసం బిల్లును జేపీసీకి పంపాలని డిమాండ్ చేశాయి. దీంతో వెనక్కి తగ్గిన కేంద్ర ప్రభుత్వం జేపీసీకి అంగీకరించింది. అందులో భాగంగా జేపీసీలో సభ్యులను శుక్రవారం నియమించింది.

బైడెన్, హారిస్ ఉమ్మడి ప్రచారం

15న మేరీల్యాండ్ సభలో పాల్గొనున్న ఇద్దరు నేతలు

అమెరికా అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా మారాయి. రిపబ్లికన్ పార్టీ తరఫున దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూసుకుపోతున్న వేళ డెమొక్రాట్ల తరఫున కమలా హారిస్ రంగ ప్రవేశం చేయడంతో పోటీ ఉత్తకంఠభరితమైంది.

2లో

ఇదీ లోకం!

కొంచెం ఎసట్లో బియ్యం తక్కువెయ్యి, నేను పనికిపోయి అన్న క్యాంటీన్లో తింటాను!

ఎమ్మెల్సీ కోసం కూటమి ఎత్తులు

బొత్సకు దీటైన అభ్యర్థి కోసం అన్వేషణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ జిల్లాలో స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరగనున్న నేపథ్యంలో రాజకీయం వేడెక్కింది. ఇటీవల జీవీఎంసీ స్థాయి సంఘం ఎన్నికల్లో తొలిసారి పది స్థానాలకు 10 స్థానాలను దక్కించుకొని స్థాయి పెంచుకున్న టీడీపీ కూటమి అదే దూకుడుతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందడానికి వ్యూహాలు సిద్ధం చేస్తోంది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలో ఉన్న ప్రజా ప్రతినిధులంతా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల వేడిలోనే ఉన్నారు. ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు కసరత్తు ప్రారంభించారు. ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం విశాఖ జిల్లా నేతలతో భేటీ అయ్యారు. వైసీపీ అభ్యర్థిగా ఇప్పటికే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఆ పార్టీ ఖరారు చేసింది. కాగా బలం లేకపోయినా కూటమి తరఫున అభ్యర్థిని బరిలోకి దింపాలని తెలుగుదేశం నిర్ణయించింది. జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో పదికి పది స్థానాలూ గెల్చుకొని జోరుమీదున్న కూటమి నేతలు ఈ నెల 30న జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గెలుపు లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. బొత్సను దీటుగా ఎదుర్కొనే అభ్యర్థిని ఎన్నికల బరిలో దించాలని భావిస్తున్నారు. ఇటీవల కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు, ఆశావహులతో గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సంప్రదింపులు

- మిగతా 2 లో

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

వైసీపీ శ్రేణులకు అండగా ఉంటా: వైఎస్ జగన్

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారాంపురంలో ఇటీవల దారుణ హత్యకు గురైన వైసీపీ కార్యకర్త పెద్ద సుబ్బరాయుడు కుటుంబాన్ని వైసీపీ అధినేత వైఎస్ జగన్ శుక్రవారం పరామర్శించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి నుండి ఓర్వకల్‌కు చేరుకున్న జగన్... రోడ్డు మార్గం ద్వారా సీతారాంపురానికి మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. సుబ్బరాయుడు భార్య సుబ్బమ్మను, కుటుంబ సభ్యులను పరామర్శించి హత్య గురించి

- మిగతా 2 లో

బైడెన్, హారిస్ ఉమ్మడి ప్రచారం

15న మేరీల్యాండ్ సభలో పాల్గొనున్న ఇద్దరు నేతలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా మారాయి. రిపబ్లికన్ పార్టీ తరపున దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూసుకుపోతున్న వేళ డెమొక్రాట్ల తరపున కమలా హారిస్ రంగ ప్రవేశం చేయడంతో పోటీ ఉత్తకంఠభరితమైంది. దేశాధ్యక్షుడు, డెమొక్రాట్ల తరపు అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ రేసులో నుంచి తప్పుకొన్న తర్వాత పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. హారిస్ పుంజుకున్నారు. దీంతో హారిస్‌తో కలిసి ప్రచారం చేసేందుకు బైడెన్ ముందకొచ్చారు. ఈనెల15న వాషింగ్టన్ సమీపంలోని మేరీల్యాండ్ సభకు హాజరవుతారు. అమెరికా సంక్షేమాన్ని, ధరల నియంత్రణకు తీసుకునే చర్యలతో పాటు తాము సాధించిన పురోగతిపై బైడెన్, హారిస్ చర్చిస్తారని శ్వేతసౌధం శుక్రవారం ఒక ప్రకటన చేసింది. కాగా ఎన్నికల ముంగిట ద్రవ్యోల్బణం సమస్య డెమొక్రాట్లను వేధిస్తోంది.

సెప్టెంబరు 10న ట్రంప్ వర్సెస్ హారిస్

అధ్యక్ష పదవికి పోటీ చేసే ప్రధాన అభ్యర్థుల మధ్య చర్చ (డిబేట్) కూడా ఆసక్తి రేకిస్తోంది. సెప్టెంబరు 10న ట్రంప్‌తో మాటల యుద్ధానికి హారిస్ అంగీకారం తెలిపారు. ఏబీసీలో వీరిద్దరు మధ్య రసవత్తర చర్చ జరగనున్నది. సెప్టెంబరు 4, 25వ తేదీల్లోనూ చర్చలు జరపాలని ట్రంప్ అన్నారు కానీ హారిస్ నిరాకరించారు. ట్రంప్ ఫోరిడాలోగల పామ్ బీచ్‌లోని నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేను సెప్టెంబరు 4న, 25వ తేదీన కూడా చర్చలను కోరుకుంటాన్నా. వాటిని ఫాక్స్, ఎన్‌బీసీలో ప్రచారం చేస్తాయి' అని అన్నారు. ఇదిలావుంటే 'ఎట్టకేలకు తనతో చర్చకు ట్రంప్ సిద్ధం అయ్యారని, సెప్టెంబరు 10న డిబేట్ కోసం ఎదురు చూస్తున్నా' అంటూ 'ఎక్స్'లో హారిస్ పేర్కొన్నారు.

హారిస్‌కు ఆదరణ

జులైతో పోల్చుకుంటే కమలా హారిస్‌కు ప్రజా మద్దతు గణనీయంగా పెరిగింది. ట్రంప్‌ను ఆమె వెనక్కు నెట్టివేసినట్లు ఇప్సోస్ పోల్ పేర్కొంది. రాయిటర్స్/ఇప్సోస్ సర్వే ప్రకారం ట్రంప్‌ను 42శాతం నుంచి 37శాతానికి హారిస్ పరిమితం చేసినట్లు తెలుస్తోంది. హారిస్ దూకుడుతో ట్రంప్ బృందం గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. బైడెన్ మీద ట్రంప్ సాధించిన ఆధిక్యతను హారిస్ తుడిచిపెట్టినట్లు ఒపీనియన్ పోల్స్ సూచిస్తున్నాయి. హారిస్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన తర్వాత డెమొక్రాట్ పార్టీకి విరాళాలు వెల్లువెత్తాయి.

జపాన్‌కు అతిభారీ భూకంప ముప్ప

శాస్త్రవేత్తల హెచ్చరిక

టోక్యో: దక్షిణ జపాన్‌ను 7.1 తీవ్రతతో భూకంపం కుదిపివేసిన క్రమంలో 8-9 తీవ్రతతో మరొక అతిభారీ భూకంపం (మెగాక్వేక్) వచ్చే ప్రమాదమున్నట్లు శాస్త్రవేత్తలు హెచ్చరించారు. 'అతిభారీ భూకంపం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కానీ కచ్చితంగా చెప్పలేం' అని జపాన్ వాతావరణ సంస్థ (జేఎంఏ) తెలిపింది. 2011లో వచ్చిన భారీ భూకంపం తర్వాత ఏర్పాటు చేసిన నూతన వ్యవస్థ ద్వారా జారీ అయిన తొలి హెచ్చరిక ఇదే కావడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. వచ్చే 30ఏళ్లలో 'మెగాక్వాక్' సంభవించేందుకు 70శాతం అవకాశమున్నట్లు ప్రభుత్వం గతంలో పేర్కొంది. 'మెగాక్వాక్' వస్తే జపాన్‌లోని పసిఫిక్ తీర ప్రాంతంతో పాటు 3,00,000 మంది తీవ్రంగా ప్రభావితమవుతాయని నిపుణులు అంచనా వేశారు. 2011లో 9.0 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల సునామీ రాగా 18,500 మంది చనిపోయారు. ఫుకుషిమా అణు కేంద్రంలో దుర్ఘటన చోటుచేసుకుంది. ఇదిలావుంటే మెగాక్వేక్ హెచ్చరిక కారణంగా తన మధ్యాసియా పర్యటనను ప్రధాని ఫుమియో కిషిదా రద్దు చేసుకోనున్నట్లు వచ్చిన వార్తలను ప్రభుత్వ అధికార ప్రతినిధి తోసిపుచ్చారు.

27శాఖలు యూనుస్ వద్దే...

నూతన సలహా మండలికి శాఖల కేటాయింపు

ఢాకా: బంగ్లాదేశ్‌లో కొలువుదీరిన ఆపద్ధర్మ ప్రభుత్వం... పరిపాలన సాగించేందుకు చకాచకా చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ సారథిగా మహమ్మద్ యూనుస్ బాధ్యతలు చేపట్టిన క్రమంలో నూతన సలహా మండలికి శుక్రవారం శాఖలు కేటాయించారు. దౌత్యాధికారి మహమ్మద్ తౌహీద్ హుస్సేన్ విదేశాంగ శాఖాధిపతి కాగా రక్షణ, విద్య, ఆహారం, జలవనరులు, పరిపాలన, ఇంధనం వంటి 27 శాఖలను యూనుస్ చూసుకోనున్నట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది. ఆర్మీ రిటైర్డ్ బ్రిగేడియర్ జనరల్ ఎం షెకావత్ హుస్సేన్‌కు హోంశాఖ, బంగ్లాదేశ్ బ్యాంక్ మాజీ గవర్నర్ సలాహుద్దీన్ అహ్మద్‌కు ఆర్థిక శాఖ, మాజీ అటార్నీ జనరల్ ఏఎఫ్ హసన్ ఆరిఫ్‌కు స్థానిక పరిపాలన శాఖ బాధ్యతలు అప్పగించారు. విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన స్టూడెంట్స్ ఎగైనెస్ట్ డిస్క్రిమినేషన్‌కు చెందిన సమన్వయకర్తలు ఎం.నహీద్ ఇస్లాం, ఆసిఫ్ మహమూద్‌కు పరిపాలనలో భాగస్వామం కల్పించారు. టెలీకమ్యూనికేషన్స్, సమాచార సాంకేతిక శాఖ, యువజన&క్రీడా శాఖలు ఇచ్చారు. కాగా, తన 27 శాఖల్లో నుంచి కొన్నింటిని గురువారం రాత్రి ప్రమాణ స్వీకారం చేయలేకపోయిన ముగ్గురు సభ్యులకు యూనుస్ కేటాయిస్తారని సమాచారం.

వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివాసీ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ గిరిజన విభాగం అధ్వర్యాన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైసీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు మేరాజోత్ హనుమంత్ నాయక్, మాజీ చైర్మన్ గుండా సురేంద్ర, పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజ్, గిరిజన విభాగం ప్రాంతీయ ఇన్‌చార్జి మానుపాటి చిరంజీవి, అధికార ప్రతినిధులు యందేటి సుబ్బయ్య, కేపీ కులాయప్ప నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడా రమేశ్, మానుపాటి నవీన్, కుడుముల రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శులు రమావత్ శ్రీకాంత్ నాయక్, మేకల ఏడుకొండలు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు మేడా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సహజ పద్ధతుల్లో సాగు మేలు: ఢిల్లీరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సహజ సాగు పద్ధతులే భవిష్యత్ వ్యవసాయానికి మూలమని వ్యవసాయ శాఖ సంచాలకుడు ఎస్.ఢిల్లీరావు అన్నారు. రాష్ట్రంలో 30లక్షల హెక్టార్ల నిస్సార, బీడు భూములు ఉన్నాయని, వీటిని పచ్చగా మార్చేందుకు పీఎండీఎస్ విధానం పాటించాలని, తద్వార వచ్చే దిగుబడులతో ఆదాయం రావడమే కాక పరిసర ప్రాంతాల ఉష్ణోగ్రత తగ్గుతుందని తెలిపారు. పీఎండీఎస్ విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది మన దేశమేనన్నారు.

తాడేపల్లిలోని పంచాయత్ రాజ్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్ కార్యాలయంలోగల సమావేశ మందిరంలో 26 జిల్లాల వ్యవసాయ అధికారులు, రైతు సాధికార సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లతో ప్రకృతి వ్యవసాయం-వివిధ సాగు విధానాల నమూనాపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. వ్యవసాయ, సహకార శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ మాట్లాడుతూ రసాయనిక మందుల వాడకుండా, సహజ పద్ధతుల్లో సాగు చేయటంతో రైతులు ఆర్థికంగా ఎదగగలరన్నారు. అలాగే ఆరోగ్యకర పంటోత్పత్తులు అందజేయడంతో సమాజానికి మేలు చేసిన వారవుతారని తెలిపారు. అగ్రో ఎకాలజీ సెంటర్‌తో పాటు అనేక అంశాలపై రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ ఆనంద్, సీఈఓ బి.రామారావు ప్రసంగించారు.

సిసోడియా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు అప్పటి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మనీశ్ సిసోడియాను అరెస్టు చేసిన సంగతి విదితమే. సిసోడియా విడుదల సందర్భంగా భారీ సంఖ్యలో ఆయన మద్దతుదారులు జైలు వద్దకు చేరుకొని స్వాగతం పలికారు. వారిని ఉద్దేశిస్తూ ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. "జైల్లో ఉన్నంతకాలం ఢిల్లీ ప్రజలు, దేశంలోని చిన్నారులంతా మానసికంగా నాతోనే ఉన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నియంతృత్వానికి చెంపపెట్టు. ఇందుకు సర్వోన్నత న్యాయస్థానానికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నా. తోడుగా నిలిచిన మీ అందరికీ ధన్యవాదాలు" అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం శక్తితోనే తాను బయటకు వచ్చానన్న ఆయన.. ఇదే శక్తి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విడుదలకు మార్గం సుగమం చేస్తుందన్నారు. అంతకుముందు సుప్రీం కోర్టులో సిసోడియాకు బెయిల్ లభించింది. న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం రూ.10లక్షల వ్యక్తిగత పూచీకత్తు, ఆ మొత్తానికి ఇద్దరు షూరిటీలతో సిసోడియాను విడుదల చేయాలని ఆదేశించింది. సిసోడియా తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయరాదని పేర్కొంది. సిసోడియాకు బెయిల్ మంజూరు చేసిన క్రమంలో సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీశ్ సిసోడియా గత 17 నెలలుగా జైలులో ఉన్నారని, ఇంకా ఆయనపై విచారణ ప్రారంభం కాలేదని పేర్కొంది. ఈ కేసులో బెయిల్ కోరిన మనీశ్‌ను ట్రయల్ కోర్టుకు పంపడం న్యాయాన్ని అపహాస్యం చేయడమేనని వ్యాఖ్యానించింది. 'బెయిల్ అనేది నియమం- జైలు మినహాయింపు' అనే విషయాన్ని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు గ్రహించాల్సిన సమయం ఆసన్నమైందని ధర్మాసనం అభిప్రాయపడింది. "ఏ నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరు. కేసు విచారణలో పురోగతి లేకపోయినా.. ఒక పరిమితి దాటిన తర్వాత ఆ వ్యక్తిని జైల్లో ఉంచడం సరికాదు. అలాకాదంటే ఆ వ్యక్తి హక్కులను హరించడమే అవుతుంది. బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడం, ఉపశమనం పొందడం వారి హక్కు" అని తెలిపింది.

వైసీపీకి మాజీల బైబై

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతోంది. మద్దాల గిరి, పెండెం దొరబాబుకు ప్రస్తుతం వైసీపీలో సొంత నియోజకవర్గాలు లేవు. గత ఎన్నికల్లో వారికి ఎమ్మెల్యే టికెట్లు దక్కలేదు. వైసీపీలో తగిన ప్రాధాన్యత, సరైన గుర్తింపు లేకపోవడం వల్లే పార్టీని వీడుతున్నట్లు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. రాజకీయ స్వలాభం కోసం కాదని, పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, ఎలాంటి పదవులు ఆశించడం లేదని, ప్రజలకు మంచి జరగాలన్నదే తన కోరికని స్పష్టం చేశారు. పిఠాపురంలో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన వంగా గీతానే ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్నారు.

మద్దాల గిరి కోటలో విడదల రజని

గుంటూరు వెస్ట్ నుంచి మద్దాల గిరి 2019 ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేసి... వైసీపీకి దగ్గరయ్యారు. 2024 ఎన్నికల్లో మద్దాల గిరికి టికెట్ ఇవ్వకుండా, ఆయన నియోజకవర్గంలో అప్పటి మంత్రి విడదల రజనికి కేటాయించారు. పొన్నూరు ఎమ్మెల్యేగా కొనసాగుతున్న కిలారు రోశయ్యకు ఇష్టం లేకపోయినప్పటికీ, గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దింపారు. దీంతో ఆయన సొంత నియోజకవర్గమైన పొన్నూరులో అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళీకృష్ణకు టికెట్ ఇచ్చారు. ఇప్పుడు పొన్నూరుకు అంబటి మురళీకృష్ణ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. కిలారుకు స్థానం లేదు. దీంతో కిలారు రోశయ్య, మద్దాల గిరి, పెండెం దొరబాబు రాజకీయ భవిష్యత్ కోసమే పార్టీని వీడినట్లుగా స్పష్టమవుతోంది. వైసీపీ సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు కిలారు రోశయ్య స్వయనా అల్లుడు. దీంతో రోశయ్య పార్టీని వీడటంతో ఉమ్మారెడ్డి కూడా గుడ్ బై చెబుతారన్న ప్రచారం ఉంది. విజయవాడ ఎంపీగా పోటీ చేసిన కేశినేని శ్రీనివాస్ (నాని) కూడా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు మరో నేత ఆళ్ల నాని ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటానని తెలిపారు. ఆళ్ల నానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండో విడత మంత్రివర్గంలో చోటు దక్కలేదు. అప్పటి నుంచి ఆయన పార్టీలో నామమాత్రంగానే కొనసాగుతున్నారు. ఓటమి అనంతరం తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి అనేక ప్రాంతాల నుంచి నేతలు వచ్చి జగన్‌ను కలిసినా, ఆళ్ల నాని ఆచూకీ ఎక్కడా కనిపించలేదు. అప్పటి నుంచే ఆయన పార్టీని వీడతారన్న ప్రచారం ఉంది. ఇంకా చాలా మంది మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు వైసీపీ అధిష్టానానికి టచ్‌లోకి రాకుండా ఉన్నట్లు సమాచారం. మరికొందరు వారిపై ఉన్న కేసులతో ప్రత్యక్షంగా బయటకు రాలేకపోతున్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన నేతలు ఎక్కడా కనిపించడం లేదు. ఈ పరిణామాలు వైసీపీ కేడర్‌కు తీవ్ర ఇబ్బందికి గురిచేస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయింది. దీనిని వైసీపీ కైవసం చేసుకోవాలని ప్రయత్నిస్తుండగా... ఈ రాజీనామాల పర్వంతో నేతలు డీలా పడుతున్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకున్నారు. బాధితులకు పార్టీ ఎల్లప్పుడు తోడుగా, అండగా ఉంటుందని ఎటువంటి భయాందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అలాగే ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆళ్లగడ్డ వైఎస్సార్సీపీ నాయకుడు భూమా కిషోర్ రెడ్డి అనుచరుడైన చాకలి శ్రీనివాసులును, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు.

అనంతరం వైఎస్సార్సీపీ నాయకుడు నారపురెడ్డిని కలిసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బుగ్గన రాంజేంద్రనాథరెడ్డి, నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు ఇషాక్ బాషా, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితర పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం మీడియా సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ సీతారాంపురంలో టీడీపీ నాయకులు వైఎస్సార్సీపీకి మద్దతు తెలిపిన సుబ్బరాయుడును, నారపురెడ్డి, పెద్దిరెడ్డి, మరి కొందరిని హత్యచేయాలని పథకం పన్నారని... పెద్ద సుబ్బరాయుడిని అత్యంత దారుణంగా రాడ్లు, కత్తులతో దాడి చేయడం బాధాకరమన్నారు. గ్రామంలో ఉద్రిక్తత ఉందని తెలిసినా అదనపు పోలీస్ బలగాలను ఎందుకు పంపలేదో చెప్పాలన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికలవేళ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న ఆలోచన లేకుండా గత రెండున్నర నెలల్లో అరాచక పాలన, మారణ హోమం సృష్టిస్తోందని జగన్ మండిపడ్డారు. చంద్రబాబు, లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే అండదండలతో స్థానిక టీడీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి ఎస్ఐ సమక్షంలోనే సుబ్బరాయుడును హతమార్చడమే కాక అడ్డువచ్చిన అతని భార్య సుబ్బమ్మను చంపబోయారని ఆరోపించారు. హత్య చేసిన వారిపై, చేయించిన వారిపై కేసులు ఎందుకు పెట్టలేదో పోలీసు అధికారులు చెప్పాలన్నారు. హత్య జరుగక ముందు జరిగిన తర్వాత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేకు ఫోన్లు చేయలేదా? వారి కాల్ రికార్డులు పరిశీలించాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనల్లో అన్నీ ఇలాగే జరిగాయన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని... రెడ్ బుక్ పాలన సాగుతోందని...లోకేశ్ రెడ్ బుక్ పాలనను రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో చేస్తున్నారని ఆరోపించారు. న్యాయస్థానంలో బాధితుల పక్షాన పోరాటం చేస్తానని... బాధితులకు అండగా నిలుస్తామని చెప్పారు.

పెద్దిరెడ్డి భూ దందాపై న్యాయ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, గెలిచిన ఎమ్మెల్యేలతో ప్రజా సమస్యలపై జగన్ పోరాటం చేయకుండా తప్పించుకుంటున్నారని చెప్పారు. దేశంలో రాబోయే ఏ ఎన్నికలైనా బ్యాలెట్ పేపర్లతో పెడితే మంచిదని నారాయణ సూచించారు. కేరళలోని వయనాడ్‌లో జరిగిన విపత్తు బాధాకరమని, ప్రకృతి విలయతాండవానికి ఎంతో మంది బలయ్యారని నారాయణ విచారం వ్యక్తం చేశారు. వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. కేరళ ఘటనపై ప్రధాని మోదీ నిష్పక్షపాతంగా... మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. బంగ్లాదేశ్‌లో అవినీతి, అహంభావం పెరిగిందని, ప్రజాస్వామ్యాన్ని షేక్ హసీనా చంపేశారని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో విద్యార్థులు, ప్రజాసంఘాలు అనుసరిస్తున్న తీరు సరైందేనని ఆయన సమర్థించారు. బంగ్లాదేశ్ పరిణామాలు నరేంద్రమోదీకి గుణపాఠం లాంటివన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, తిరుపతి నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో హిజాబ్‌లు ధరించొచ్చు

(మొదటిపేజీ తరువాయి)

విధించింది. కళాశాల యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏం ధరించాలేనేది మీరెలా నిర్ణయిస్తారని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థినులు ఏం ధరించాలో కాలేజీలు నిర్ణయిస్తే మహిళా సాధికారికత మాటేమిటని ప్రశ్నించింది. కళాశాలలో అందరూ సమానమని, మతాల ప్రదర్శనకు అది వేదిక కాకూడదనే ఉద్దేశంతోనే తాము హిజాబ్ నిషేధించామని చెంబూరు కళాశాల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై కోర్టు స్పందిస్తూ పేర్లల్లో కూడా మతం ఉంటుందని, మరి దాన్ని ఎలా తొలగిస్తారని కళాశాల యాజమాన్యాన్ని తిరిగి ప్రశ్నించింది. 'అమ్మాయిలు ఏం ధరించాలనేది వారి వ్యక్తిగత నిర్ణయం. దేశంలో అనేక మతాల ప్రజలు నివసిస్తున్న విషయం కళాశాల యాజమాన్యానికి తెలియదా? స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లకుపైనే అవుతున్నా... ఇప్పటికీ ఇలాంటి అంశాలపై చర్చ రావడం దురదృష్టకరం. మేం ఇచ్చిన ఉత్తర్వులను దుర్వినియోగం చేయకూడదు' అని పేర్కొంటూ తదుపరి విచారణను నవంబర్ 18కి కోర్టు వాయిదా వేసింది. కాలేజీలో హిజాబ్ నిషేధంపై కొంతమంది విద్యార్థినులు సుప్రీం తలుపుతట్టగా... తాజాగా ధర్మాసనం తీర్పు వెలువరించింది. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను ఎవరూ దుర్వినియోగం చేయరాదని, అలాంటిదేమైనా జరిగితే తమని ఆశ్రయించవచ్చని విద్యా సంఘాలకు సూచించింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం 'ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠే కాలేజీ'ని నిర్వహిస్తున్న చెంబూరు ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీకి నోటీసులు జారీ చేసింది. నవంబర్ 18లోగా ఈ అంశంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

నీట్ పీజీ పరీక్ష వాయిదా కుదరదు

(మొదటిపేజీ తరువాయి)

సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) నిర్వహిస్తోంది. ఇప్పటివరకు పేపర్ లీకేజీ ఆరోపణలు రాలేదు. అయితే, నీట్-యూజీ 2024 పరీక్షపై దేశవ్యాప్తంగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీట్ పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసింది. దేశవ్యాప్తంగా 185 నగరాల్లో ఆగస్టు 11న కంప్యూటర్ ఆధారిత విధానంలో రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఆధారంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

విట్‌లో అంతర్జాతీయ సెమినార్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, డేటా ఇంజినీరింగ్ (ఐసీసీఐడీఈ)పై అమరావతిలోని విట్‌లో శుక్రవారం ఆరవ అంతర్జాతీయ సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమెరికాలోని లాఫ్‌బరో విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిజిటల్ టెక్నాలజీస్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ సంగరపిళ్లై లంబోతరన్, గౌరవ అతిథిగా సెంట్రల్ లంకాషైర్ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ అండ్ కంప్యూటింగ్ ప్రొఫెసర్, డీన్ డాక్టర్ మైఖేల్ ఫెర్నాండో పాల్గొని పరిశోధనలపై కీలక అంశాలను వివరించారు. విట్ ఏపీ వైస్ ఛాన్సలర్ కోటరెడ్డి, డాక్టర్ నాగరాజు దేవరకొండ, డాక్టర్ సీహెచ్. ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ సరోజ్ కుమార్ పాణిగ్రాహి తదితరులు ప్రసంగించారు. వివిధ యూనివర్సిటీల నుండి విచ్చేసిన రీసెర్చ్ స్కాలర్లు పరిశోధనా పత్రాలు సమర్పించారు.

అప్పుల బాధతో హోటల్ యజమాని ఆత్మహత్య

విశాలాంధ్ర-గోనెగండ్ల: అప్పుల బాధతో పురుగుల మందు తాగి మిన్నల్లా (50) అనే హోటల్ యజమాని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చిన్నమర్రివీడు గ్రామానికి చెందిన మిన్నాల్లా హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం ఎకరా భూమి అమ్ముకున్నాడు. అయితే ఇద్దరు ఆడపిల్లల పెళ్లి కారణంగా అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల శుక్రవారం మధ్యాహ్నం గాజులదిన్నె కాలువ గట్టు పక్కన పురుగుల మందు తాగి మిన్నల్లా ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల రైతులు పోలీసులకు తెలిపారు. సీఐ గంగాధర్ కేసు నమోదు చేసి... దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్సీ కోసం కూటమి ఎత్తులు

(మొదటిపేజీ తరువాయి)

జరిపారు. చంద్రబాబుకు ఆ నివేదిక పంపారు. మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద సత్యనారాయణ, గండి బాబ్జీ పేర్లు తొలినుండి వినిపిస్తున్నప్పటికీ తాజాగా దిలీప్ చక్రవర్తి పేరును తెరపైకి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో అధికారికంగా అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైసీపీ వ్యతిరేక ఓట్లపై కూటమి నేతలు దృష్టిసారించారు. మొత్తం 838 ఓట్లుండగా... వీటిలో టీడీపీ బలం 200కుపైగా ఉంది. విజయం సాధించాలంటే దాదాపు 450 ఓట్లు అవసరం. ఇప్పటికే కూటమి వైపు దృష్టిసారించిన వారితోపాటు మరో 90-100 మంది మద్దతు సాధిస్తే సునాయాసంగా విజయం సాధించవచ్చని భావిస్తున్నారు. ఆ దిశగా ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ ఎన్నిక పర్యవేక్షణ బాధ్యత మంత్రి అచ్చెన్నాయుడుకు అప్పగించగా... ఎన్నిక జరిగే నియోజకవర్గాలకు ఆయన ఇన్‌ఛార్జులను నియమించనున్నారు. మరోవైపు వైసీపీ అధినేత జగన్ ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రజా ప్రతినిధులతో తాడేపల్లిలో గత వారం రోజులగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. తమ ప్రజాప్రతినిధులు చేజారి పోకుండా వారందరినీ బెంగళూరుకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

ఆదివాసీల్లో వెలుగులు నింపుతాం

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఆదివాసీలు పండించే ఉత్పత్తులు, తయారు చేసే కళాకృతులను పరిశీలించారు. అరకు కాఫీని తాగారు. స్వాతంత్రోద్యమంలో ఆదివాసీల పాత్ర, చరిత్రను తెలియజేసేలా రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆదివాసీ చీరను అడవి తల్లికి సమర్పించారు. గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేశారు. అనంతరం సీఎం ప్రసంగించారు. 'ఇటీవల 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాం. డీఎస్సీకి పోటీ పడే గిరిజన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తాం. గిరిజన విద్యార్థుల కోసం విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తాం. ఆదివాసీల్లో అనేక కళలున్నాయి. వాటిలో అరకు గిరిజన నృత్యం దేశంలోనే ప్రత్యేకమైంది. వ్యవసాయం, హస్తకళలు, నృత్యం, సంప్రదాయ ఆహారాలను గిరిజనులు పాటిస్తున్నారు. వాటిద్వారా అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో ఆదివాసీలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మీ త్యాగాలు, మీ మద్దతు జాతి మరవదు. దేశంలో 10.42 కోట్ల మంది గిరిజనులున్నారు. రాష్ట్రంలో 5.56 శాత మంది ఉన్నారు. మైదానంలో ఉండే వారి జీవన ప్రమాణాలు తక్కువగా ఉన్నాయి. ఏజెన్సీలో ఉండే వారికి కనీసం రోడ్లు కూడా సరిగా లేవు. గత ప్రభుత్వం దుర్మార్గంగా గతంలో మేం అమలు చేసిన 16 సంక్షేమ పథకాలను రద్దు చేసింది. ఆదివాసీల్లో పుట్టిన పిల్లలతో పాటు తల్లులు కూడా చనిపోతున్నారు. ఈ సంఖ్యను తగ్గించాలి. పిల్లల సంఖ్య తగ్గితే వృద్ధుల సంఖ్య పెరుగుతుంది. మన పిల్లలే మనకు ఆస్తి. వారిని బాగా చదివిస్తే మనం కష్టంలో ఉన్నప్పుడు చూసుకుంటారు. దేశంలో తలసరి ఆదాయం రూ.1.72 లక్షలు ఉంటే ఏపీలో రూ.2.20 లక్షలు ఉంది. కానీ ఆదివాసీల్లో రూ.1.20 లక్షలే ఉంది. పేదల జీవన ప్రమాణాలపై శ్రద్ధ పెడతాం. అన్ని విధాలా పైకి తీసుకొస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆరోగ్య, ఆర్థికంతో పాటు కుటుంబానికి కావాల్సిన వసతులపై సమగ్ర విధానం తీసుకొస్తాం. గిరిజనుల్లోని సమరయోధుల త్యాగాలను తెలియజేసేందుకు లంబసింగిలో మ్యూజియంను, సీతంపేట ఐటీడీఏలో రూ.7 కోట్లతో సమగ్ర పసుపు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. 2,191 గిరిజన గ్రామాలకు త్వరలో రోడ్డు మార్గాలు నిర్మిస్తాం.

16,816 గిరిజన నివాస ప్రాంతాలన్నింటికీ కుళాయి ద్వారా నీళ్లు అందిస్తామంటూ సీఎం హామీల వర్షం కురిపించారు. రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లోని అన్ని మండలాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

ఇక సమయం వృథా చేయలేం

15న అత్యవసర చర్చలు జరపాలి

కైరో/వాషింగ్టన్: కాల్పుల విరమణ, బందీల విడుదల కోసం ఒప్పందాన్ని అమలు చేసేందుకు సమయం ఆసన్నమైందని అమెరికా, ఖతార్, ఈజిప్టు వెల్లడించాయి. హమాస్, ఇజ్రాయిల్ మధ్య రాజీ కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. తక్షణమే రెండు వర్గాల మధ్య రాజీ కోసం ఈనెల 15న అత్యవసర చర్చలకు పిలుపునిచ్చారు. కార్యాచరణ ఒప్పందం అమలు ఎలా అన్నదే ఖరారు కావాల్సి ఉన్నట్లు వెల్లడించాయి. 'ఇక వృథా చేసేందుకు గానీ సాకులు వినేందుకుగానీ సమయం లేదు. బందీల విడుదలకు, కాల్పుల విరమణకు సమయం ఆసన్నమైంది' అని ఇజ్రాయిల్, హమాస్‌కు మూడు దేశాలు తేల్చిచెప్పాయి. మిగతా సమస్యలను పరిష్కరించేందుకుగాను ప్రతిపాదన సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నాయి. చర్చలు, సంప్రదింపులకు సానుకూలమేనని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించగా హమాస్ ఇంకా స్పందించాల్సి ఉంది.

ఇరాన్‌కు ఆ హక్కు లేదు: అమెరికా

ఇజ్రాయిల్‌పై దాడి చేసేందుకు ఇరాన్‌కు హక్కు లేదని అమెరికా సీనియర్ అధికారి స్పష్టంచేశారు. టెల్ అవీవ్‌పై దాడులకు టెహ్రాన్ ఉపకరిస్తే ఇరాన్ ఆర్థికంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. 'ఇజ్రాయిల్‌పై సైనికపరంగా దాడి చేసేందుకు ఇరాన్‌కు చట్టబద్ధంగా ఎటువంటి కారణంగానీ హక్కుగానీ లేదు. లాజిక్ లేని ఈ చర్యలను పూర్తిగా తిరస్కరిస్తున్నాం' అని బైడెన్ ప్రభుత్వాధికారి పేర్కొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలపై ఉత్తర్వులు

(మొదటిపేజీ తరువాయి)

దినేశ్‌కుమార్ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపింది.

జిల్లాల్లో పాల్గొనే మంత్రుల వివరాలు...

గుంటూరులో మంత్రి నారా లోకేశ్, శ్రీకాకుళంలో అచ్చెన్నాయుడు, మచిలీపట్నంలో కొల్లు రవీంద్ర, నరసరావుపేటలో నాదెండ్ల మనోహర్, నెల్లూరులో పొంగూరు నారాయణ పాల్గొంటారు. అనకాపల్లిలో వంగలపూడి అనిత, చిత్తూరులో సత్యకుమార్ యాదవ్, పశ్చిమ గోదావరి జిల్లాలో నిమ్మల రామానాయుడు, కడప జిల్లాలో ఫరూక్, తిరుపతి జిల్లాలో ఆనం రామనారాయణరెడ్డి, అనంతపురం జిల్లాలో పయ్యావుల కేశవ్, విశాఖ జిల్లాలోఅనగాని సత్యప్రసాద్, ఏలూరు జిల్లాలోకొలుసు పార్థసారథి, ప్రకాశంజిల్లాలో డోలా బాలవీరాంజనేయ స్వామి, బాపట్ల జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, తూర్పు గోదావరిజిల్లాలో కందుల దుర్గేశ్, పార్వతీపురం మన్యం జిల్లాలో సంధ్యారాణి, నంద్యాల జిల్లాలో బీసీ జనార్థన్‌రెడ్డి, కర్నూలు జిల్లాలో టీజీ భరత్, సత్యసాయి జిల్లాలో సవిత, అమలాపురంలో వాసంశెట్టి సుభాశ్, విజయనగరంలో కొండపల్లి శ్రీనివాస్, అన్నమయ్య జిల్లాలో రామ్ ప్రసాద్‌రెడ్డి జాతీయ జెండాలను ఎగురవేస్తారు.

పంచాయతీరాజ్ బలోపేతానికి సహకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామ స్థాయిలో పంచాయతీ రాజ్, రెవెన్యూ వ్యవస్థల బలోపేతం దిశగా సీఎం చంద్రబాబు నిర్ణయించడం సంతోషకరమని, దీనికి తమ సంఘం పూర్తిగా సహకరిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి అప్పలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గత వైసీపీ ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాలతో చర్చించకుండా, అసంబద్ధత నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. దీనివల్ల గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగస్తులకు ప్రమోషన్ ఛానల్ లేకపోవడడమే కాక పంచాయతీ సెక్రటరీలకు, వీఆర్వోలుకు, సర్పంచులకు, విభేదాలు సృష్టించేలా చేశారన్నారు. ఇప్పుడు గ్రామస్థాయిలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం చేసే దిశగా అడుగులు వేయడం శుభ పరిణామమని తెలిపారు. త్వరలో జరగబోయే సచివాలయ వ్యవస్థ సమూల మార్పులకుగాను ప్రభుత్వానికి తమ సంఘం సహకరిస్తుందన్నారు.

కార్పొరేట్ సంపద పునఃపంపిణీ

- అప్పుడే రైతులు, కార్మికులు, పేదలకు సంక్షేమ సమాజం
- తణుకులో 'క్విట్ కార్పొరేట్స్' సభలో వక్తలు

విశాలాంధ్ర-తణుకు: రైతులు, కార్మికులు, పేదలకు ఆర్థిక న్యాయం కల్పించే సంక్షేమ సమాజాన్ని సాధించడానికి కార్పొరేట్ సంపద పునః పంపిణీ జరిగి తీరాలని వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం 'క్విట్ కార్పొరేట్స్ డే' సందర్భంగా స్థానిక సురాజ్య భవనంలో రైతు, కార్మిక, ప్రజాసంఘాలు సంయుక్తంగా బహిరంగ సభ నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి తణుకు స్టడీ సర్కిల్ కార్యదర్శి డా. బి.రమేష్ చంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దారిదీపం సంపాదకులు, రైతు కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షులు డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నల్లచట్టాలను సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వంలో రైతాంగం తిప్పికొట్టిందని తెలిపారు. అయితే స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు అన్ని పంటలకు లాభసాటి ధరలను చట్టబద్ధంగా కల్పించడానికి నిరాకరించడాన్ని నిరసిస్తూ 'క్విట్ కార్పొరేట్స్ డే'ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నినాదం కేవలం రైతులకు మాత్రమే పరిమితమైంది కాదని, కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ దేశ సంపద పునః పంపిణీ ద్వారా సంక్షేమ సమాజాన్ని కాంక్షించే ప్రజల పోరాటమని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఒక పక్క కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి పనిగంటల పెంపుతో సహా వారి హక్కులను హరిస్తోందని, మరోపక్క దేశంలో సహజ వనరులను, పోర్టులు, విమానాశ్రయాలు, గనులు, ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నదని విమర్శించారు. కార్పొరేట్లను కట్టడి చేసే పోరాటాలతో కార్మికులు తమ హక్కులను రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.ప్రతాప్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రభుత్వమని, వారి కోసమే ప్రభుత్వ రంగ పరిశ్రమలను వరుసగా అమ్మకాలు చేస్తున్నదని తెలిపారు. విశాఖ ఉక్కును అమ్మే ప్రయత్నాలను ప్రతిఘటించాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పేరూరి మురళీ కుమార్ మాట్లాడుతూ ఒక శాతం మంది బిలియనీర్లు, కుబేరుల దగ్గర 50 శాతం దేశ సంపద పోగు పడిందని, కార్పొరేట్లపై అదనపు ఆదాయ పన్ను, సంపద పన్ను, వారసత్వ పన్నులను విధించి సంపద పునః పంపిణీ ద్వారా శ్రమజీవులకు, రైతులకు ఆర్థిక న్యాయాన్ని సాధించడానికి ఉద్యమించాలని కోరారు. ఈ సభలో రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు సంకు మనోరమ, లంక కృష్ణమూర్తి, ఎస్ఎన్‌పీఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు గొల్లపల్లి అంబేద్కర్, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ నీలం మాల్యాద్రి, ప్రసాద్, మల్లిపూడి శివ, ప్రభాకర్, రైతు నాయకులు వీరబాబు, సీఐటీయూ నాయకులు గార రంగారావు, ఏఐటీయూసీ నాయకులు దత్తాత్రేయ ప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సభలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు చల్లా అప్పారావు, అజ్జరపు సుబ్బారావు, యర్రమిల్లి నరసింహా రావు, సంకు అప్పారావు, వంక సత్యనారాయణ, భూపతిరాజు సుబ్బరాజు కుటుంబ సభ్యులను సత్కరించారు.

విశాఖ పోర్టు సందర్శించిన నేపాల్ బృందం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: పది మంది సభ్యులతో కూడిన నేపాల్ బృందం శుక్రవారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శించింది. ఈ బృందానికి విశాఖపట్నం పోర్ట్ అధికారులు సాదర స్వాగతం పలికారు. పోర్టులో ఉన్న మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోర్టు ట్రాఫిక్ మేనేజర్ యాజీ రామశేఖర్ నేపాల్ బృందానికి వివరించారు. రెండు దేశాల మధ్య పరస్పర వ్యాపార ప్రయోజనాలను పెంపొందించడం కోసం ఉన్న సాంకేతిక, వాణిజ్యపరమైన అంశాలను పరిశీలించడమే ప్రధాన ఉద్దేశంగా నేపాల్ బృందం పర్యటన సాగింది. వ్యాపార అవకాశాలు, సరళతర వ్యాపార అవకాశాలు, టర్న్ అరౌండ్ టైం, కస్టమ్స్ క్లియరెన్స్, డ్రెడ్జింగ్ పనులు వంటి కీలక అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో పోర్టు విభాగాధిపతులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు తెలిపారు.

పంచాయతీల్లో స్వాతంత్ర్య వేడుకలకు భారీగా నిధులు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతీ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని... ఆనాడు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణకు పంచాయతీలకు నిధుల కొరత లేకుండా తమ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రవన్ కల్యాణ్ తెలిపారు. పంచాయతీల్లో ఆగస్టు 15న వేడుకల నిర్వహణకు ఇచ్చే మొత్తాన్ని గణనీయంగా పెంచుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ మైనర్ పంచాయతీలకు రూ.100, మేజర్ పంచాయతీలకు రూ.250 ఇచ్చేవారనీ... కానీ ఇప్పుడు ఆ మొత్తాలను రూ.10 వేలు, రూ.25 వేలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు. 2011 జనాభా ఆధారంగా 5 వేలులోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.10 వేలు, 5వేలు పైబడి జనాభా ఉన్న పంచాయతీలకు రూ.25 వేలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ మొత్తంతో స్వాతంత్ర్య దినోత్సవం రోజున కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలకు ఇదే విధంగా రూ.10 వేలు, రూ.25 వేలు చొప్పున నిధులు అందిస్తామని ప్రకటించారు. ఇటీవల కొందరు సర్పంచులు పవన్‌ను కలిసిన సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే నిర్వహణ కూడా కష్టంగా ఉందని వాపోయారు. దీనిపై వివరాలు తెలుసుకున్న ఆయన రూ.10 వేలు, రూ.25 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. అలానే పంచాయతీల అధ్వర్యంలో ఆగస్టు 15, జనవరి 26 నాటి కార్యక్రమాలు ఏ విధంగా చేయాలో కూడా మార్గదర్శకాలు జారీచేశారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించాలని, పంచాయతీ పరిధిలోని స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణ రంగం నుంచి వచ్చివారినీ, పారిశుధ్య కార్మికులను సత్కరించాలని, పాఠశాలలు, అంగన్వాడీల్లోని పిల్లలకు మిఠాయిలు/చాక్లెట్లు అందించాలనీ, పారిశుధ్యంపై మహాత్మా గాంధీజీ చెప్పిన మాటలతో ప్రమాణం చేయించాలని పేర్కొన్నారు.

ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు మహర్దశ

పరిశ్రమల మంత్రి భరత్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. శుక్రవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి ఆయన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్‌ను పరిశీలించారు. అంతకుముందు గతంలో చంద్రబాబు సీఎంగా ఉండగా ఎయిర్‌పోర్టు సమీపంలో ఇండస్ట్రియల్ జోన్‌కు శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. కొందరు దుండగులు శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని ఖండించారు. ఆ తర్వాత ఇండస్ట్రియల్ జోన్‌కు వెళ్లి అధికారులతో మాట్లాడారు. నీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. అనంతరం జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను మంత్రి భరత్, ఎమ్మెల్యే చరితారెడ్డికి ఫ్యాక్టరీ యాజమాన్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మంత్రి భరత్ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అవ్వడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన పరిశ్రమలు మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో ఇప్పుడున్న ఫ్యాక్టరీని మరింత విస్తరించేందుకు జయరాజ్ ఇస్పత్ యాజమాన్యం ముందుకొస్తోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలందరితో చర్చలు జరుపుతున్నామని, రాష్ట్రంలో వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వారంతా ఆసక్తిగా ఉన్నట్లు మంత్రి భరత్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్ లో మౌలిక సదుపాయాల కల్పనకు 1800 కోట్ల రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ గ్రీన్ జోన్‌లో ఉందని, ఓర్వకల్లు రెడ్ జోన్‌లో ఉండటంతో ఎలాంటి పరిశ్రమలైనా ఇక్కడ ఏర్పాటు చేయొచ్చన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్లో పెట్టుబడులు ఊహించిన దానికంటే ఎక్కువగానే వస్తాయన్నారు. ఇక్కడ నీరు, విద్యుత్, రోడ్డు, రైల్వే లైన్ ఇతర సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఇక్కడ అనేక పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఈ గ్రామాలలోని యువతకు ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ ఎండి కొయాంక, కర్నూల్ ఆర్డీవో శేషిరెడ్డి,ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం మారుతి ప్రసాద్, ఓర్వకల్లు తహసిల్దార్ వెంకటరమణ, ఇండస్ట్రియల్ ఏఈ సందీప్, పాల్గొన్నారు.

ఆ ఉద్యోగుల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

డేగా ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు: అకారణంగా తొలగించిన డీసీసీబీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ అధ్వర్యంలో ఏలూరులోని డీసీసీబీ బ్యాంకు వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇందుకు సిద్ధం కావాలని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆయన పిలుపునిచ్చారు. అసంఘటిత రంగ కార్మిక చట్టాల అమలు బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో జరిగిన సమావేశాలలో ఉద్యోగులనుద్దేశించి డేగా ప్రభాకర్ మాట్లాడుతూ డీసీసీబీ బ్యాంకు 34 శాఖల్లో పనిచేసే 54 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను జూన్2న విధుల్లో నుంచి తొలగించగా, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితంలేదని తెలిపారు. ఉద్యోగులకు న్యాయం జరిగేందుకు పోరుబాట పట్టాల్సిందేనని పిలుపునిచ్చారు. అసంఘటిత కార్మికుల కోసం ఏఐటీయూసీ ఎన్నో ఉద్యమాలు చేసిందని గుర్తుచేశారు. ఆలిండియా బ్యాంకర్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కూడా బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై పోరాడుతోందన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులంతా సంఘటితంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఉద్యోగుల పోరాటానికి సీపీఐ మద్దతు ఉంటుందని డేగా ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

క్విట్ ఇండియా, యువజన కాంగ్రెస్ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం క్విట్ ఇండియా దినోత్సవం, యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలీ, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు తదితరులు కలసి మొక్కలను నాటారు. షేక్ మస్తాన్ వలీ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సమగ్రతను కాపాడటంలో విఫలమైందన్నారు. ప్రజలను కులాలు, మతాలు, ప్రాంతాలుగా విడదీసి వారిలో భేదాభిప్రాయాలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు. ప్రజలంతా విభేదాలను విస్మరించి ఐక్యంగా ఉండాలన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అనంతరం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ పిలుపు మేరకు అఖిల భారత యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షులు లక్కరాజు రామారావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ పిలుపు మేరకు భవిష్యత్ తరాల భవిత కోసం దేశవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవాడ నుంచే పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో షేక్ మస్తాన్ వలీ, లక్కరాజు రామారావు, వి.గురునాథం, కొలనుకొండ శివాజీ, కుర్షీదా, గంగిశెట్టి ఉమా శంకర్, అన్సారీ, టి.ఎలమందారెడ్డి, పీవై కిరణ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం కూల్చేస్తారు

- మేరుగు నాగార్జున, నందిగం సురేశ్ ఆందోళన
- స్మృతివనం దగ్గర వైసీపీ నేతల నిరసన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ స్వరాజ్య మైదానంలోని 125 అడుగుల ఎత్తులో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కూల్చివేసే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి మేరుగు నాగార్జున, మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో శుక్రవారం మేరుగు నాగార్జున, నందిగం సురేశ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగార్జున మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహానికి కేంద్ర బలగాలతో భద్రత కల్పించాలన్నారు. భావితరాలకు దిక్సూచిగా ఉండాలన్న లక్ష్యంతో గత జగన్ ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించిందని గుర్తు చేశారు. నాడు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టాలని తాము డిమాండ్ చేయగా... ఆయన తమపై కేసులు నమోదు చేశారని చెప్పారు. ఇప్పుడు విజయవాడలో అంబేద్కర్ స్మృతివనంపై దాడికి ప్రయత్నించారని, కూటమి ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదన్నారు. ఇక్కడ అంబేద్కర్ విగ్రహం ఉండకూడదనే కుట్రతోనే దాడికి దిగారని, తక్షణమే ఈ సంఘటనపై విచారణ జరపాలని, దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఎన్నికల్లో కూటమి నేతలు ఇష్టం వచ్చినట్లుగా హామీలిచ్చారన్నారు. ప్రజల దృష్టిని మళ్లించడానికే అంబేద్కర్ విగ్రహంపై దాడికి ప్రయత్నించారని మండిపడ్డారు.

స్మృతివనం దగ్గర వైసీపీ నేతల నిరసన: అంతకుముందు స్వరాజ్య మైదానంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేతలు దేవినేని అవినాశ్, పోతిన మహేశ్, విజయవాడ నగర మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు వెళ్లి నిరసనకు దిగారు. స్మృతివనంపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. టీడీపీ కనుసన్నల్లోనే జగన్ పేరు తొలగించారని మండిపడ్డారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం ఉండకూడదనే టీడీపీ నేతలు దాడికి దిగారన్నారు. ఈ సంఘటన తెలియడంతో దళిత సంఘాల నేతలు అక్కడకు చేరుకుని, స్మృతివనం గేటు దగ్గర నల్ల బ్యాడ్జీలతో నిరసనకు దిగారు.

సంక్షోభం నుంచి సంక్షేమమంటే ఇదేనా?

విత్తనాల కోసం రైతుల కష్టాలు కనిపించవా: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్షోభం నుంచి సంక్షేమం అంటే... కుండపోత వర్షంలో విత్తనాల కోసం మహిళలను ఇబ్బందులు పాలు చేయడమేనా? అని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కూటమి ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. విత్తనాల కొరతపై వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన వివరణ అసంపూర్తిగా ఉందని మండిపడ్డారు. సాగర్ కుడికాలువ కింద రైతులకు విత్తన కొరత లేదని గుండె మీద చెయ్యి వేసుకొని చెప్పగలరా?, పల్నాడు జిల్లాలో కౌంటర్ల దగ్గర రైతుల పడుతున్న కష్టాలు మీకు కనిపించడం లేదా? అని ఆమె శుక్రవారం 'ఎక్స్' వేదికగా కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంబంధిత శాఖ మంత్రిగా నేరుగా పరిస్థితి చూసే మాట్లాడుతున్నారా?, రాత్రంతా క్యూ లైన్లో రైతులను నిలబెట్టడమా... మీ ప్రభుత్వ కట్టుబడి అని ప్రశ్నించారు. రైతుల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పే దమ్ము లేదని పేర్కొన్నారు. గత జగన్ ప్రభుత్వం రైతులను నిండా ముంచడంతోనే కనీసం ప్రతిపక్ష హోదా దక్కలేదన్నారు. రైతులను వ్యతిరేకించే బీజేపీతో మీరు కూటమి కట్టి, పక్షపాతిగా ఉంటామని హామీలు ఇచ్చి, గద్దెనెక్కి ఇప్పుడు రైతులను వర్షంలో నిలబెట్టడం ఏమిటని ఆమె నిలదీశారు.

గిరిజన బిడ్డలకు శుభాకాంక్షలు : షర్మిల

గిరిజన బిడ్డలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శుభాకాంక్షలను షర్మిల తెలిపారు. ప్రత్యేక జీవనశైలి ఆదివాసీలకే సొంతమని, తమ సంస్కృతిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ భవిష్యత్‌పై కోటి ఆశలు పెట్టుకుని, మనుగడ సాగిస్తున్న అడవి బిడ్డల జీవితాలపై నేటి ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని పేర్కొన్నారు. కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోని గిరి పల్లెలు, సంపూర్ణంగా అందని సంక్షేమ, అభివృద్ధి ఫలాలు, దయనీయంగా కొనసాగుతున్న గిరిజనుల జీవనం, కాలినడకలు, డోలీ మోతలు... విద్య, వైద్యం, రోడ్లు, రవాణా అంతంత మాత్రమేనని తెలిపారు. ఇదేనా మన రాష్ట్రంలో గిరిజనాభివృద్ధి అంటూ ప్రభుత్వాన్ని షర్మిల నిలదీశారు.

వలంటీర్లకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: రాజకీయ పార్టీలు స్వార్థం కోసం వలంటీర్ల జీవితాలతో చెలగాటమాడరాదని... వలంటీర్లకు న్యాయం చేయాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, ఆంధ్రప్రదేశ్ వలంటీర్ ్స అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జి.ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు, జగదీశ్, రమణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి లంకా గోవిందరాజులు ప్రభుత్వాన్ని కోరారు. వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) సమావేశం శుక్రవారం విజయవాడలోని దాసరి నాగభూషణరావు భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లకి రూ.10వేల జీతం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. వలంటీర్లకు రెండు మూడు నెలల నుంచి నిలిచిపోయిన గౌరవవేతనం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక ఎన్నికల సమయంలో రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ నెల పదో తేదీ నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రంలో వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయలుతో పాటుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక పంచాయతీ సాంఘిక సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులకు మెయిల్స్, పోస్ట్ కార్డుల ద్వారా లేఖలు పంపుతామన్నారు. ఈ నెల 14వ తేదీలోపు ప్రభుత్వం నుంచి వలంటీర్లకు న్యాయం చేస్తూ ప్రకటన రానిపక్షంలో ఆగస్టు 16 తర్వాత ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిలకు వలంటీర్ల సమస్యలపై నివేదన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఆంధ్రప్రదేశ్ వలంటీర్ అసోసియేషన్ నూతన రాష్ట్ర కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం)కు మొత్తం 21 మందితో నూతన రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షులుగా గుజ్జుల ఈశ్వరయ్య, అధ్యక్షుడిగా జగదీష్, ప్రధాన కార్యదర్శిగా రమణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పరుచూరి రాజేంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శిగా లంకా గోవిందరాజులు, ఉపాధ్యక్షులుగా సరోజిని, వాసు, రాజేష్, కార్యదర్శులుగా జంగాల చైతన్య, రసూల్, శ్యామలి, యామిని ఎన్నికయ్యారు.

ముగిసిన పాఠశాల యాజమాన్య సంఘం ఎన్నికలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ ఎన్నికలు ముగిశాయి. మరో 631 పాఠశాలల్లో వివిధ కారణాల రీత్యా వాయిదా వేశారు. ఈ నెల 8వ తేదీ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రంలో 24 జిల్లాల్లోని 40,781 పాఠశాలలకు గాను 40,150 (98.45 శాతం) పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలను సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుల అధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధిలో భాగస్వామ్యం లక్ష్యంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. 631 పాఠశాలల్లో వివిధ కారణాలతో వాయిదా వేశారు. ఎన్నికల నిర్వహించని పాఠశాలలకు రీషెడ్యూల్ ప్రకటించినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో ఈనెల 17న ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహిస్తారు. ఇప్పటివరకు నిర్వహించిన 24 జిల్లాలకుగాశ్రీను శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా 2,643 పాఠశాలలు ఉండగా, 2,560 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. అతి తక్కువగా విశాఖపట్నం జిల్లాలో 589 పాఠశాలలు ఉండగా, 587 పాఠశాలలకు ఎంఎస్‌సీ ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన ఎన్నికలకు రీ షెడ్యూలు ఇచ్చి నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఉండకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, కూటమి పార్టీలకు చెందిన సానుభూతి పరులే అత్యధికంగా ఈ ఎన్నికల్లో పదవులను దక్కించుకున్నారు.

వైద్యం అందక తల్లీబిడ్డ మృతి

విశాలాంధ్ర-జీకే వీధి (అల్లూరి జిల్లా): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున వైద్యం అందక ఒక గిరిజన తల్లీబిడ్డ మృతి చెందారు. గిరిజనులకు ఎంతో మేలు చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నప్పటికీ ప్రతిచోట, ప్రతి రోజూ ఏదో మూల విద్య, వైద్యం విషయంలో గిరిజనులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. శుక్రవారం అల్లూరి జిల్లాలో జరిగిన ఘటన గిరిజనులకు అందుతున్న సదుపాయాలకు అద్దం పడుతోంది. వివరాల్లోకి వెళితే... అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గూడెం కొత్త వీధి మండలంలోని రింతాడ పంచాయతీ ఊబ పాలెం గ్రామానికి చెందిన ఓ నిండు గర్భిణి, గర్భస్థ శిశువు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వంతల పరిమళ అనే నిండు గర్భిణిని పురిటి నొప్పులతో బాధపడుతుండగా గురువారం రాత్రి కుటుంబీకులు చింతపల్లి ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. రాత్రి వేళ కావడంతో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో చింతపల్లి ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడకు వెళ్లిన తర్వాత గర్భిణిని వైద్యులు పరీక్ష చేసి, అప్పటికే కడుపులో బిడ్డ మృతి చెందిందని చెప్పారు. బిడ్డను బయటికి తీసి, తల్లి ఆరోగ్యం కూడా ప్రమాదకర స్థాయిలో ఉందని గుర్తించి, మెరుగైన వైద్యం కోసం సూచించారు. దీంతో కుటుంబీకులు విశాఖ పట్నం కేజీహెచ్‌కి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే వంతల పరిమళ మృతి చెందింది. తన బిడ్డ పరిమళ మృతికి చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడమే కారణమని ఆమె తల్లి తండ్రులు భానుమతి, బంగారం ఆరోపించారు. సకాలంలో వైద్యం చేసి ఉంటే తమ కుమార్తెతో పాటు శిశువు కూడా బతికుండేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సంపాదకీయం

అడపాదడపా న్యాయం!

ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు శుక్రవారం సుప్రీంకోర్టు ఎట్టకేలకు బెయిలు మంజూరు చేసింది. 2021-22 నాటి ఢిల్లీ మద్యం కేసులో సీబీఐ నమోదు చేసిన అవినీతి, డబ్బు అక్రమ చెలామణి కేసులో నిర్బంధంలో ఉంచి 17 నెలల తరవాత సుప్రీంకోర్టు ఆయనను బెయిలు మీద విడుదల చేసింది. సిసోడియాను 2023 ఫిబ్రవరి 26న అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన నిర్బంధంలోనే ఉన్నారు. అయితే ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టొరేట్ గానీ, సీబీఐ కానీ ఆయన మీద రెండున్నరేళ్లుగా కనీసం చార్జ్‌షీట్ కూడా దాఖలు చేయకుండా నిరవధికంగా నిర్బంధంలో ఉంచడం కుదరదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు చేసిన మరో ఆరోపణ కూడా చాలా ముఖ్యమైంది. బెయిలు నియమం, తప్పనిసరి అయితేనే జైలు అన్న సూత్రాన్ని అమలు చేయకుండా కింది కోర్టులు, హైకోర్టులు వాటంగా తప్పించుకుంటున్నాయని దీనివల్ల అనేక కేసులు వివిధ కోర్టుల్లో పేరుకు పోతున్నాయని కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, కె.వి. విశ్వనాథన్ తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు. ఇదే కేసులో మొట్ట మొదట అరెస్టు అయింది సత్యేంద్ర జైన్. తరవాత సంజయ్ సింగ్‌ను అరెస్టు చేశారు. కానీ ఆయనకు బెయిలు మంజూరు అయింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా జైలులోనే ఉన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎత్తి చూపినట్టుగా మనీశ్ సిసోడియా కేసులో 493 మంది సాక్షులున్నారని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ అంటోంది. ఈ సాక్షులందరినీ విచారించడానికి, అసలు విచారణ ప్రారంభం కావడానికి ఎంత సమయం పడ్తుంది, చివరకు ఎప్పటికి ఈ వ్యవహారం కొలిక్కి వస్తుంది అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. విచారణే ప్రారంభం కాకుండా 17 నెలలపాటు నిర్బంధంలో ఉంచడం రాజ్యాంగంలో మనిషికి జీవించే హక్కును, స్వేచ్ఛను ప్రదానంచేసే 21వ అధికరణాన్ని ఉల్లంఘించడమేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సిసోడియా కేసులో విచారణ ఎప్పుడు ప్రారంభమై ఎప్పుడు ముగుస్తుందో చెప్పాలని న్యాయమూర్తులు సీబీఐని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్‌ను ప్రశ్నించడం చాలా వాస్తవికమైందే కాక విప్లవకరమైన ప్రశ్న కూడా. విచారణ ప్రారంభంకాకుండా ఎవరినైనా సుదీర్ఘకాలం పాటు జైలులో ఉంచడం అంటే "విచారణ లేకుండా శిక్ష విధించడమే" అని న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్య కూడా తీవ్రమైందే. ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ను డబ్బు అక్రమ చెలామణి నిరోధకచట్టం (పి.ఎం.ఎల్.ఎ.) కింద 2022 మే లో అరెస్టు చేశారు. ఆయన మీద మద్యం కేసు లేదు. ఆయనకూ ఇంతవరకు బెయిలు ఇవ్వనే లేదు. ఆ తరవాత సిసోడియాను 2023 ఫిబ్రవరి 26న అరెస్టు చేస్తే ఆయన రెండు రోజుల తరవాత ఉపముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. పి.ఎం.ఎల్.ఎ. కేసు మోపి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ సిసోడియాను 2023 మార్చి 9న అరెస్టు చేసింది. ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను 2024 మార్చి 21న మద్యం కేసులోనే అరెస్టు చేశారు. ఆయన మీద కూడా పి.ఎం.ఎల్.ఎ. కేసు, అవినీతి కేసు మోపారు. కానీ వీరంతా డబ్బు ఏ రీతిలో అక్రమంగా చెలామణి చేశారో ఇంతవరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ రుజువు చేయలేక పోయింది. ఆ డబ్బు ఆచూకీ కూడా పట్టుకోలేక పోయింది.

అత్యంత ప్రచారంలో ఉన్న ఢిల్లీ మద్యం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీలో నోరు విప్పి మాట్లాడగలిగే వారినందరినీ ఇరికించారు. అరెస్టు చేశారు. కానీ చార్జ్‌షీట్ మాత్రం దాఖలు చేయకపోవడం సీబీఐ, ఎన్‌ఫోర్స్ మెంటు డైరెక్టొరేట్ నిష్క్రియాపరత్వానికి ప్రతీక. ఈ ధోరణిని సుప్రీంకోర్టు సైతం గుర్తించింది. ఆమ్ ఆద్మీ పార్టీ అగ్ర నాయకులను అవినీతి, పి.ఎం.ఎల్.ఎ. కేసుల్లో అరెస్టు చేయడం వెనక బీజేపీ క్షుద్ర రాజకీయాలున్నాయని పదే పదే చెప్పాల్సిన అవసరంలేదు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు కూడా గుర్తిస్తూనే ఉంది. కానీ ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం చేయగలిగింది ఏమీ లేదు అన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తులు పదవీ విరమణ సందర్భంలో జరిగే వీడ్కోలు సమావేశాల్లో, వివిధ కేసుల విచారణా క్రమంలో చాలా ఉత్తేజకరమైన, స్ఫూర్తిదాయకమైన వ్యాఖ్యలు చేస్తుంటారు. అవి చాలా వినసొంపుగా ఉంటాయి. కానీ అత్యున్నత న్యాయ పీఠాల మీద ఆశీనులైన వారు తాము చెప్పిన అంశాలను ఆచరణలో తీర్పుల్లో ప్రస్తావించిన సందర్భాలు తక్కువ. సిసోడియాకు బెయిలు మంజూరు చేసిన సమయంలో న్యాయమూర్తులు గవాయ్, విశ్వనాథం చేసిన వ్యాఖ్యలు న్యాయం మిగిలే ఉంది అన్న ఆశలు కల్పిస్తాయి. కానీ కింది కోర్టులు, హైకోర్టులు "బెయిలు హక్కు, తప్పని సరి అయితేనే జైలు" అన్న సూత్రాన్ని పాటించని న్యాయస్థానాల మీద చర్య మాత్రం తీసుకోవు. కింది కోర్టులు, హైకోర్టులకు ఈ విషయంలో తగిన మార్గదర్శక సూత్రాలు జారీ చేసిన దాఖలాలే కనిపించవు. బెయిలు హక్కు, తప్పనిసరి అయితేనే జైలు అన్న సూత్రాన్ని ఎందుకు అమలు చేయడంలేదో హైకోర్టులతో సహా కింది కోర్టులకు సరైన మార్గదర్శక సూత్రాలు జారీచేసే అధికారం సుప్రీంకోర్టుకు లేదా. సుప్రీంకోర్టు చెప్పేదే అంతిమ న్యాయం అయినప్పుడు కింది కోర్టులు, హైకోర్టులు భిన్నంగా ప్రవర్తించే అవకాశం ఎందుకు ఇస్తున్నట్టు. భీమా కోరేగావ్ కేసు అయిదేళ్లకు పై నుంచి నానుతోంది. అందులో ప్రముఖ రచయితలను, న్యాయవాదులని, పౌర హక్కుల కోసం పోరాడే వారిని అరెస్టు చేశారు. కొందరికి బెయిలు వచ్చింది. స్టాన్ స్వామి నిర్బంధంలో ఉండగానే ప్రాణాలు వదిలారు. ఆ కేసులో కూడా విచారణ ప్రారంభమే కాలేదు. సత్వర విచారణ జరిగేలా చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలది అనుకుంటే ఆ ప్రభుత్వాలను కట్టడి చేయొచ్చుగా. ఆ పని సుప్రీంకోర్టు ఎన్నడూ చేయలేదు. విచారణ ప్రారంభం అయినా విచారణ దశాబ్దాల పాటు కొనసాగడానికి బాధ్యత న్యాయవ్యవస్థదే కాదా. పేరుకు పోయిన కేసులను తెమల్చడానికి న్యాయవ్యవస్థకు అనేక అడ్డంకులు ఉండవచ్చు. ఈ అడ్డంకులను సరిదిద్దడానికి అత్యున్నత న్యాయస్థానం ఎన్నిసార్లు ఆదేశించిందో లెక్కలేమైనా ఉన్నాయా. సత్వర విచారణ పూర్తి కాకపోవడానికి ప్రభుత్వాలది, న్యాయవ్యవస్థది బాధ్యత అయినప్పుడు అక్కడో సిసోడియాకు, ఇక్కడో దేవాంగనా కలితకు బెయిలు మంజూరు చేసినా ఫలితం ఏముంటుంది? గత మే 21న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ, జూన్ 4న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అరవింద్ కుమార్, సందీప్ మెహతాతో కూడిన బెంచిని సుప్రీం కోర్టు అంతిమంగా తిరగతోడి ఉండవచ్చు. ఇలాంటి సందర్భాలలో సుప్రీంకోర్టు బెయిలు హక్కు అని చెప్పినా ఆ సూత్రాన్ని అమలు చేయని చేయని వారి మీద చర్య తీసుకునే వారే ఉండరా. సిసోడియా కేసులో తీర్పు నిరంకుశత్వానికి చెంప పెట్టు, సత్యమే గెలుస్తుంది లాంటి నినాదప్రాయ భావనవల్ల, ఇది న్యాయవ్యవస్థ విజయం అని జబ్బలు చరుచుకున్నందువల్ల ఫలితం ఏమీ ఉండదు. లోపం ఎక్కడుంది అన్న అంశం నిందితులకు సంబంధించింది కాదు. కచ్చితంగా లోపాన్ని సరిదిద్ద వలసిన బాధ్యత అత్యున్నత న్యాయస్థానానిదే. అడపా దడపా జరిగేది న్యాయం కానేరదు.

అభివృద్ధి, పురోగతి ఎక్కడ?

సుబ్బరాయన్, సీపీఐ ఎంపీ

కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన నరేంద్ర మోదీ ప్రభుత్వం తన అసమర్థతను నిరూపించుకుంది. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోవడంతో కేంద్రంలోని పాలకులు పాలించలేమని చాటుకున్నారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలనే నెరవేర్చలేదు, అటువంటప్పుడు వారి కొత్త హామీలను మనం ఎలా నమ్మాలి? ఆధారపడాల్సిన విశ్వసనీయులుగా గత పదేళ్లుగా వారి పరిపాలన లేదు. ఇంతకుముందు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను కాషాయదళం ఇంతవరకు నెరవేర్చలేదు. ఈ కొత్త హామీలు భారతదేశ ప్రజలను మరోసారి మోసం చేయడంలాంటివే తప్ప మరొకటి కాదు. కేంద్ర ప్రభుత్వం పురోగతి, అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. అభివృద్ధి ఎక్కడ ఉంది? పురోగతి ఎక్కడ?74.1 శాతం భారతీయులు పోషకాహారలోపంతో బాధపడుతున్నారని యునిసెఫ్, డబ్ల్యుహెచ్ఓ నివేదికలు ఘోషిస్తున్నాయి. మన దేశ జనాభాలో 3/4వంతు మంది పోషకాహార లోపంతో అల్లాడుతుంటే అభివృద్ధి లేదా పురోగతి ఎక్కడ జరుగుతోంది? ద్రవ్యోల్బణం అదుపులో ఉందని భారత ఆర్థిక సర్వే చెపుతోంది. అయితే, వాస్తవ పరిస్థితి ఏమిటి? ఈ ఏడాది జులైలో ద్రవ్యోల్బణం 9.4 శాతానికిపైగా నమోదైంది. ఈ ప్రభుత్వం అభివృద్ధి, ప్రగతి గురించి మాట్లాడితే, అది కేవలం కంటితుడుపు చర్య తప్ప మరేమి కాదు. బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు, ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, బీహార్‌కు సహాయాన్ని అందించడాన్ని మేము సమర్థిస్తున్నాం. ఎన్నికల సమయంలో ఈ రాష్ట్రాలు కేవలం ఆర్థిక సాయాన్ని మాత్రమే డిమాండ్ చేయలేదన్న విషయాన్ని బీజేపీ గుర్తుంచుకోవాలి. బీజేపీ చౌకబారు రాజకీయ ప్రయోజనాల కోసం ఈ రాష్ట్రాలకు ఆర్థిక సాయం ప్రకటించారనడంలో ఏ మాత్రం అతిశయోక్తిలేదు.

నేడు మన దేశంలో నిరుద్యోగం విలయతాండవమాడుతోంది. భారీ ఉపాధిని సృష్టించగల స్థితిలో ఎంఎస్ఎంఈలున్నాయి. అయితే, బీజేపీ మాత్రం కార్పొరేట్ కంపెనీలకు, బహుళజాతి కంపెనీలకు మాత్రమే మద్దతిస్తోంది. ఇలాంటి విధానాల వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నష్టపోతున్నాయి. ఎంఎస్ఎంఈలను ఆదుకోవాలని ప్రభుత్వం అనుకుంటే వాటిపై విధించే జీఎస్టీని తగ్గించాలి. వారి రుణాలను మాఫీచేయాలి. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వ్యవసాయరంగంలో జరిగిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాయి. అందువల్ల నిరుద్యోగ సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. వంద రోజుల ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం అస్తవ్యస్థం చేస్తోంది. ఈ పథకాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఈ పథకం క్రింద పని దినాలను వంద రోజుల నుంచి 200 రోజులకు పెంచాలి. అంతేకాకుండా దినసరి వేతనం రూ. 500కు తగ్గకుండా చూడాలి. ఆ విధంగా చేయడం వల్ల దాదాపు 33 కోట్ల మంది ప్రజలు ప్రయోజనం పొందుతారు. గ్రామీణ నిరుద్యోగం తగ్గుతుంది.

ఎంపీల ఎంపీల్యాడ్ పథకానికి ఏడాదికి రూ. 5 కోట్లు కేటాయిస్తున్నారు. అందులో రూ.90 లక్షలు జీఎస్టీ క్రింద వసూలు చేస్తున్నారు. జీఎస్టీ మినహాయిస్తే ఆ మొత్తం ఏడాదికి రూ. 4 కోట్లకు తగ్గిపోతోంది. పర్యవసానంగా ఒక్కొక్క శాసనసభా నియోజకవర్గానికి కేవలం రూ. 65 లక్షలు మాత్రమే ఎంపీలు ఇవ్వగలుగుతున్నారు. ఇలా అయితే ఎన్నికైన ప్రజాప్రతినిధుల అకాంక్షలు ఎలా నెరవేరుతాయి. తమిళనాడులో స్థానిక ఏరియా అభివృద్ధి నిధిగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 4 కోట్లు ఇస్తున్నారు. ఈ నిధికి జీఎస్టీ మినహాయింపు ఉంది. ఎంపీల్యాడ్‌ని కనుక మనం లెక్కిస్తే ఒక్కొక్క ఎంపీ తన లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి కేవలం రూ. 65 లక్షలు మాత్రమే కేటాయించాల్సి వస్తోంది. ఎంపీల్యాడ్ క్రింద ఇచ్చే నిధులు తప్పనిసరిగా సమృద్ధిగా ఉండాలి, జీఎస్టీ నుంచి మినహాయించాలి. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో డబ్బు వసూలు చేయడం అక్రమమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ బాండ్ల పేరుతో డబ్బు వసూలు చేసిన కేంద్ర ప్రభుత్వానికి అవినీతిపై మాట్లాడే నైతిక హక్కు ఏమాత్రంలేదు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సేకరించిన అక్రమ సొమ్మును జప్తు చేసి ప్రభుత్వ ఖజానాకు తరలించాలి. శత్రువులను సృష్టించి మోసం చేసి ప్రభుత్వ ఖజానాకు తీసుకెళ్లని జ్ఞానం మనకు కావాలని ఋగ్వేదం చెబుతోంది. అయితే విచారించదగ్గ విషయం ఏమిటంటే పూర్తిగా శత్రువులను సృష్టించడమే ఇక్కడ అధికార పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ విధంగా చేయడం వారి పూర్తికాల వృత్తిగా మారిపోయింది. దేశంలో సామరస్యాన్ని ధ్వంసం చేయడం వారు సంప్రదాయంగా చేస్తున్న పని. అటువంటి దుష్టశక్తులను నాశనం చేయడానికి దేశభక్తియుత పౌరులు సంసిద్ధంగా ఉన్నారు. బీజేపీని అధికారం నుంచి దింపడమే దేశ భక్తులైన భారతీయుల ప్రథమ కర్తవ్యం.

(2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా చేసిన ప్రసంగపాఠం)

వయనాడ్‌కు అండగా సీపీఐ

వాయనాడ్ బాధితులకు సహాయ సామాగ్రి పంపండి
సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం పిలుపు

వయనాడ్‌లోని బాధిత ప్రజలకు తక్షణ సహాయ సామగ్రిని, నగదు లేదా వస్తు రూపంలో పంపాలని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటనను విడుదల చేసింది. నగదు లేదా వస్తు రూపంలో సహాయం చేయాలని వివిధ రాష్ట్రాల్లోని అన్ని పార్టీ యూనిట్లకు సీపీఐ విజ్ఞప్తి చేసింది. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ప్రధాన కార్యదర్శి అనీ రాజా, కేరళ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం, పార్టీ జాతీయ కార్యదర్శులిద్దరూ కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తూ సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. కేరళలోని పార్టీ యూనిట్లు, సంస్థలు సహాయక చర్యలలో చురుకుగా పనిచేస్తున్నాయి. సీపీఐ పార్లమెంటు సభ్యులు (రాజ్యసభ) పి.సంతోష్ కుమార్, పి.పి.సునీర్ కూడా ప్రభావిత ప్రాంతాలను సందర్శిస్తున్నారు.

ప్రకృతి ప్రకోపానికి గురై శవాలదిబ్బగా మారిన కేరళలోని వయనాడ్ జిల్లా మారుమూల కుగ్రామాలలో ఎటు చూసినా వినాశనమే. ప్రకృతి సృష్టించిన ఘోర విపత్తు ఎన్నో కుటుంబాలను చిదిమేసింది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గ్రామాలకు గ్రామాలే నేలమట్టమయ్యాయి. జనజీవనం పూర్తిగా అతలాకుతలమైంది. వందలమంది మృతి చెందగా, డజన్ల సంఖ్యలో తీవ్రంగా గాయపడ్డారు. వాయనాడ్‌లోని కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) అనేక మంది కార్యకర్తలను, సానుభూతిపరులను కోల్పోయింది. వయనాడ్ ప్రజలకు సహాయ సహకారాలు, వైద్య సహాయానికి సైన్యం, ప్రకృతి విపత్తుల నిరోధక నిపుణులు, పోలీసులు, ప్రతినిధులు ముమ్మర సహాయ సహకార కార్యక్రమాలు, నివాస శిబిరాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

సీపీఐ జాతీయ కార్యదర్శులు అనీ రాజా, వినయ్ విశ్వం, రాజ్యసభ ఎంపి, అడ్వకేట్ పి సంతోష్ కుమార్, కేరళ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి పీపీ సునీర్, జాతీయ సమితి సభ్యుడు, కేరళ రెవెన్యూ, గృహ శాఖ మంత్రి కె రాజన్ తదితరులు సహాయ కార్యకలాపాలకు నాయకత్వం వహిస్తున్నారు. ప్రభుత్వ, రాజకీయ స్థాయిలలో సీపీఐ వాయనాడ్ జిల్లా కార్యదర్శి ఇ.జె. బాబుతో పాటు ఇతర పార్టీ కార్యకర్తలు పోలీసులు, సహాయకార్యకలాపాల యంత్రాంగాలతో సన్నిహితంగా పనిచేస్తూ గాయపడినవారికి వైద్యసదుపాయాలు, పునరావాస సౌకర్యాలు అందిస్తున్నారు. సీపీఐ కేరళ రాష్ట్ర సమితి కార్యదర్శి వినయ్ విశ్వం వాయనాడ్‌లో సంభవించిన ప్రకృతి వైపరీత్యం వినాశనాన్ని కలిగించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకృతి విపత్తుతో నిర్వాసితులుగా మారి ఆత్మీయులను కోల్పోయిన, వయనాడ్ ప్రజలతో మమేకమై వారికి స్వాంతన కల్పించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులుగా మనపై ఉందన్నారు. ప్రస్తుత దుర్భర పరిస్థితులనుంచి వారికి ఉపశమనం కల్పించాల్సి ఉందని అన్నారు. గాయపడిన వారికి, ఇళ్లు కోల్పోయినవారికి పునరావాస సౌకర్యం నిమిత్తం సహాయక సామగ్రి, ఆర్థిక సహాయం సేకరించడంలో వ్యవస్థీకృత నిర్మాణం, సమన్వయం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సంఘాలు, పార్టీకి చెందిన వివిధ విభాగాలు వసూలు చేసిన విరాళాలను రాష్ట్ర సమితి ద్వారా ముఖ్యమంత్రి విపత్తు నిర్వహణ నిధి (సీఎమ్‌డీఆర్ఎఫ్)కి అందజేయాలని సీపీఐ రాష్ట్ర సమితి నిర్ణయించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వివిధ బోర్డులు, కార్పొరేషన్ల ఆఫీస్ బేరర్లు తమ ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఆహార పదార్థాలు, బట్టలు, ఇతర అవసరమైన నిత్యావసర వస్తువులను వాయనాడ్ జిల్లా సమితి కార్యాలయానికి పంపుతున్నారు. సహాయ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు సీపీఐ వాయనాడ్ జిల్లా సమితి కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించింది. జనసేవాదళ్, ఏఐవైఎఫ్, భగత్‌సింగ్ యూత్ ఫోర్స్ వలంటీర్లు జిల్లా అంతటా సహాయ, పునరావాస కార్యక్రమాల నిర్వహణలో నిమగ్నమై ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వం జాతీయవిపత్తుగా ప్రకటించాలి: సీపీఐ

కేరళలోని వాయనాడ్‌లో సంభవించిన తీవ్ర విషాదాన్ని జాతీయవిపత్తుగా ప్రకటించాలని సీపీఐ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. జాతీయ విపత్తు నిధి (ఎడీఆర్ఎఫ్) నుంచి అవసరమైన నిధులతో సహా సాధ్యమైన అన్ని సహాయ సహకారాలను అందించాలని కోరింది. ఈ ఘటనపై భారత కమ్యూనిస్టు పార్టీ దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో కొండచరియలు విరిగిపడటంతో, ఈ ప్రాంతంలోని గ్రామాలు, పట్టణాలు, ఆవాసాలు తీవ్ర విధ్వంసాన్ని చవిచూశాయి. వివిధ గ్రామాలు రోడ్లు, కొన్ని ప్రాంతాలలో ఇళ్ళు పూర్తిగా భారీ వర్షాలకు తుడిచిపెట్టుకుపోయాయి. ఈ సంక్షోభస్థితిలో కేరళ, వాయనాడ్ ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ తన పూర్తి సంఘీభావాన్ని తెలియజేసింది. సమీప ప్రాంతాల్లోని తమ కార్యకర్తలను సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది.

తాండవమాడుతున్న నల్లధనం

డా.జ్ఞాన్ పాఠక్

భారతదేశంలో అక్రమంగా డబ్బు దుర్వినియోగం ఒక పెద్దపరిశ్రమ అయిపోయింది. దాంతో సమంగా నల్లధనం విస్తరించింది. నల్లధనానికి పునాది డబ్బు దుర్వినియోగమే. నల్లధనాన్ని నిర్మూలిస్తానని ప్రధాని నరేంద్ర మోదీ పదేపదే పాట పాడుతుంటారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కఠిన చర్యలు తీసుకుంటుందని మోదీ చెప్పారు. అయితే ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతిపక్షనాయకులపైన మాత్రమే కక్ష కట్టినట్టుగా హింసిస్తున్నారు. క్రూరమైన డబ్బు దుర్వినియోగ నిరోధకచట్టం(పీఎమ్ఎల్ఏ) ఉన్నప్పటికీ నల్లధనం తాండవమాడుతోంది.

పీఎమ్ఎల్ఏ చట్టం కింద శిక్షలుపడిన కేసులు కేవలం 0.76శాతం మాత్రమే. ఈ విషయాన్ని ఆగస్టు 6వ తేదీన పార్లమెంటులో ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో మాట్లాడుతూ మోదీ పాలించిన పదేళ్లకాలంలో 5297 కేసులు పీఎమ్ఎల్ఏ చట్టం కింద నమోదయ్యాయని, ఇందులో 40కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయని చెప్పారు. అయితే విచారణలో ఎన్ని కేసులున్నాయనే విషయాన్ని ఆయన చెప్పలేదు. ఆ మరుసటిరోజు ఆగస్టు7న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజల్‌భుయాన్, దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం పీఎమ్ఎల్ఏ కేసును విచారణ చేసింది. ఈ సందర్భంగా 5000 కేసులుండగా, కేవలం 40కేసుల్లోనే శిక్షలు పడ్డాయని ఈడీ చెప్పడాన్ని ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. ఈడీ సంస్థ కచ్చితమైన సాక్ష్యాల ఆధారంగా కేసులను నమోదు చేయాలని కేవలం సాక్షుల ప్రకటనలమీద ఆధారపడడం సరైందికాదని ధర్మాసనం పేర్కొంది.

ఏఐఎంఐఎం ఎంపీ అససుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా నిత్యానందరాయ్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2014-2019 మధ్య కేంద్ర ప్రభుత్వం 200లోపు కేసులను మాత్రమే ప్రతిసంవత్సరం నమోదు చేసిందని మంత్రి తెలిపారు. 2014లో 195, 2015లో 148, 2016లో 170, 2017లో 171, 2019లో 146, 2019లో 188 కేసులను నమోదుచేశారు. దేశ ఆర్థికవ్యవస్థలో నల్లధనం నిరోధించేందుకు పెద్దనోట్ల రద్దును చేపట్టామని మోదీ 2016లో గొప్పగా చెప్పారు. ఈ విషయంలో ఆయన దారుణంగా విఫలమయ్యారు. 2017జులైలో జీఎస్టీని హడావుడిగా ప్రారంభించారు. ఈ చర్యకూడా దేశంలో నల్లధనం ఏ మాత్రం అరికట్టలేకపోయింది. ఈ అంశంపై మరిన్ని వివరాలు తెలుసుకునేముందు మోదీ ప్రభుత్వం అవినీతిపైన ఏ విధంగా పనిచేస్తున్నారనేది తెలుసుకుందాం. మొదట సీబీఐ అవినీతికేసును నమోదుచేసింది. ఆ తరువాత ఈడీ రంగంలోకి వచ్చి సీబీఐ నమోదుచేసిన అవినీతి కేసులనే మళ్లీ ఈడీ నమోదుచేసింది. డబ్బు దుర్వినియోగం చేయడం ద్వారా నల్లధనాన్ని పోగేశారని సీబీఐ పేర్కొన్నది. అనేక కేసులలో సీబీఐ, ఈడీ సమాంతరంగా కేసులను నమోదుచేశాయి. ప్రత్యేకించి ప్రతిపక్షాల నాయకులమీద, మోదీ ప్రభుత్వాన్ని విమర్శించినవారిమీద కేసులు పెట్టారు. దీనిపై సీబీఐ లోతుగా దర్యాప్తు చేయకపోయినప్పటికీ, కేసులను నమోదుచేసి వారికి శిక్షలు వేయించడంలో ఈడీ విఫలమైంది. ప్రతిపక్షపార్టీల నాయకులమీద అక్రమంగా కేసులు నమోదుచేసిందనే విమర్శలు వెల్లువెత్తాయి. అంతేకాదు, కేసుల పరిష్కారానికి అనేక కోట్ల రూపాయలు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. రెండవసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303 సీట్లను గెలుచుకుని తిరిగి అధికారంలోకి వచ్చింది. మోదీ రెండవసారి సాగించిన పాలనలో అవినీతి కేసులకు సంబంధించిన సమాచారాన్ని సభలో వెల్లడించింది. ప్రభుత్వం చేసిన ఆరోపణలను ప్రతిపక్షపార్టీలు రెండు సభల్లోనూ నిలువరించలేకపోయింది. ఈ కేసులను కోర్టులవరకు తీసుకువెళ్లి విచారణకు కూడా పెట్టింది. 2020 లో ఈడీ అంతక్రితంకంటే మూడురెట్లు ఎక్కువగా అంటే 708 కేసులను నమోదుచేసింది. 2021లో 1166కేసులు నమోదయ్యాయి.ఈ కేసులు కోవిడ్19 మహమ్మారి సంక్షోభ సంవత్సరాల్లో నమోదయ్యాయనే విషయాన్ని ఇక్కడ గుర్తించాలి. కేంద్రప్రభుత్వం సరైన వైద్యచికిత్సలను అందించకపోవటం కారణంగా అనేక లక్షలమంది కోవిడ్ మహమ్మారి బారినపడి చనిపోయారు. చనిపోయినవారిని కనీసం పూడ్చివేయడానికి లేదా దహనక్రియలకు చోటుచాలక శవాలను రోడ్లపైనే ఉంచారు. అనేకచోట్ల ఆక్సిజన్ సరఫరాలేక చనిపోయారు. వ్యవసాయరంగంలో మూడు వివాదాస్పద చట్టాలను పెద్దగా చర్చలేకుండా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇవి దుష్టచట్టాలని, తక్షణం వీటిని రద్దు చేయాలని కోరుతూ రైతులు మహత్తర ఉద్యమం సాగించారు. సీఏఏ, ఎన్ఆర్‌సీలపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకాయి. కార్మిక హక్కులను హరించే విధంగా అంతక్రితం ఉన్న కొన్ని డజన్ల చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్‌లను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చింది. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలను తీసుకురావడంలో గరిష్టస్థాయికి చేరిందని చెప్పవచ్చు. ప్రభుత్వాన్ని విమర్శించేవారే నోళ్లను మూయించడానికే మోదీ ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయించారు. అంతేకాదు, అనేకమంది మేధావులపైన అన్యాయంగా కేసులు, దేశద్రోహం, ఇతర కఠిన చట్టాలను వినియోగించి కేసులుపెట్టారు.

2022 లో పీఎమ్ఎల్ఏ చట్టం కింద ఈడీ 1074 కేసులను, 2023లో 934 కేసులను ఎన్నికల ముందు నమోదుచేసింది. 2024 లో పీఎమ్ఎల్ఏ చట్టంకింద 393 కేసులను ఈడీ నమోదుచేసింది. ఈ చట్టంకింద 2016 నుంచి 373మందిపై కేసులుపెట్టి అరెస్టుచేశారు. ఎక్కువగా బీహార్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఢిల్లీలో నమోదుచేసి అరెస్టుచేశారు. రాజకీయంగా వివాదాలు ఎక్కువగా నెలకొన్న రాష్ట్రాలివి. ఈ రాష్ట్రాలలో బీజేపీ అనేక ఎదురుదెబ్బలు తింది. ఇంతవరకు రెండు కేసులలో మాత్రమే అరెస్టయినవారిని విడుదల చేశారు. ఒకరు 2017లో, మరొకరు 2024లో విడుదలయ్యారు. 40 కేసులను నమోదుచేయగా, ఇద్దరిని మాత్రమే విడుదల చేయగా తక్కిన వారు ఎలాంటి విచారణ లేకుండా జైళ్లలోనే మగ్గుతున్నారు. మరో క్రూరమైన చట్టం అక్రమ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద మొత్తం 567 కేసులు నమోదుకాగా, ఇప్పటి వరకు 222 కేసులలో మాత్రమే శిక్షలను విధింపచేశారు.

ఆగస్టు 7వ తేదీన సుప్రీంకోర్టు ధర్మాసనం కేసుల నమోదు, నిజమైన సాక్షాధారాలులేకుండా ఎవరినీ అరెస్టు చేయరాదని, ఒకవేళ ఆ కేసులను మీరు నిరూపించలేకపోతే తప్పుచేసినవారవుతారని వ్యాఖ్యానించారు.

రష్యా సైన్యంలో 69 మంది భారతీయులు

జైశంకర్

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారతీయులు కొందరు రష్యా సైన్యానికి సహాయకులుగా పనిచేస్తున్నారని, వారిని తిరిగి స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం చెప్పారు. 'రష్యా సైన్యంలో భారతీయులు మొత్తం 91 మంది ఉన్నారు. అందులో ఎనిమిది మంది మృతి చెందగా... 14 మంది తిరిగి స్వదేశానికి వచ్చారు. మిగిలిన 69 మందిని తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ విషయమై స్వయంగా రష్యా విదేశాంగశాఖ మంత్రితో మాట్లాడాను. ఇటీవల ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌తో జరిగిన సమావేశంలో ప్రధానమంత్రి మోదీ సైతం ఇదే విషయాన్ని ప్రస్తావించారు. భారత పౌరులు రష్యా సైన్యంలో సేవలందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అదే పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వం సైతం ఆ ఒప్పందాలకు కట్టుబడి ఉండాల్సివస్తుంది. వేరే పనికోసం వెళ్లిన పౌరులు రష్యా సైన్యంలో ఇరుక్కున్నారని మేము భావిస్తున్నాం. రష్యా సైన్యంలో ఉన్న భారతీయులు ఎవరినైనా తిరిగి స్వదేశానికి పంపించేందుకు కృషి చేస్తానని ఆ దేశ అధ్యక్షుడు హామీ ఇచ్చారు' అని తెలిపారు.

హాకీ ఆటగాడు వివేక్‌కు కోటి నజరానా... డీఎస్పీ ఉద్యోగం

భోపాల్: పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు కాంస్య పతకం సాధించడంతో ఈ జట్టులో భాగమైన హాకీ ప్లేయర్ వివేక్ సాగర్ ప్రసాద్‌కు మధ్యప్రదేశ్ ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ శుక్రవారం వివేక్‌తో ఫోన్‌లో మాట్లాడారు. దేశానికి పతకం తెచ్చినందుకు రాష్ట్ర ప్రజల తరపున అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తరపున రూ.కోటి రివార్డుతో పాటు డీఎస్పీగా ఉద్యోగం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 52 ఏళ్ల తర్వాత తొలిసారిగా భారత్ స్పెయిన్‌ను 2-1తో ఓడించి ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఆటగాళ్లకు హాకీ ఇండియా రివార్డు ప్రకటించింది. ఆటగాళ్లలో ఒక్కొక్కరికి రూ.15 లక్షలు, సహాయక సిబ్బందికి రూ.7.5 లక్షల చొప్పున నజరానా అందించనుంది. ఈ మేరకు హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ ప్రకటన విడుదల చేశారు. మరోవైపు, ఒడిశా సీఎం మాంఝీ సైతం హాకీ ప్లేయర్లకు రివార్డు ప్రకటించారు. తమ రాష్ట్రం తరపున ఆటగాళ్లకు రూ.15 లక్షలు, సహాయక సిబ్బందికి రూ.10 లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

కొడైకెనాల్, ఊటీలకు ముప్పు?

నిపుణుల హెచ్చరిక

చెన్నై: కేరళలోని వయనాడులో సంభవించిన ముప్పు ఊటీ, కొడైకెనాల్‌కు ఉండవచ్చని నిపుణులు హెచ్చరించారు. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం... ఆ రెండు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన ప్రణాళికలను యుద్ధప్రాతిపదికన రచిస్తోంది. వయనాడు ప్రధాన పర్యాటక కేంద్రం కావడంతో కొండల వాలుపై అనేక పర్యాటక రిసార్ట్‌లు నిర్మించారు. కేరళ వెళ్లే పర్యాటకులు వయనాడు తప్పకుండా వెళ్తుంటారు. వాహనాలు వెళ్లేందుకు కొత్త రోడ్లు నిర్మించారు. ప్రకృతి విరుద్ధంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టుల కింద అడవిని ధ్వంసం చేశారని, ఈసారి నైరుతి రుతుపవనాల్లో నేల పట్టు కోల్పోయి వాననీరు అంతరాల్లోకి చేరి కొండచరియలు విరిగిపడ్డాయని పర్యావరణవేత్తలు తెలిపారు. వయనాడు మాదిరిగానే తమిళనాడులోని కొడైకెనాల్, ఊటీ, సిరుమలై, ఏర్కాడు, కొల్లి కొండ వంటి ప్రధాన వేసవి విడిది కేంద్రాల్లో కొండచరియలు విరిగిపడే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు. కొడైకెనాల్, సిరుమలై, ఏర్కాడు, ఊటీల్లో పర్యాటక హోటళ్లు, వీఐపీ ఫామ్ హౌస్‌లు, నివాసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బోరు బావులు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. కొడైకెనాల్, సిరుమలై వంటి వేసవి విడిది కేంద్రాలు సహా ప్రతి పర్యాటక ప్రదేశానికి చేరుకోవడానికి రోడ్డు సదుపాయం కల్పించారు. కొడైకెనాల్ కొండ రహదారిపై రాళ్లు, మట్టిపెళ్లలు పడి తరచూ రాకపోకలను ప్రభావితం చేస్తున్నాయి. చిన్న చిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పర్యావరణ వేత్త అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 'నీలగిరి అడవులను తొలగించి తేయాకు తోటలుగా మార్చారు. పర్వత సానువుల్లో భవనాలు నిర్మించరాదనే నిబంధన ఉంది. అయితే కొండచరియల్లో భవనాల సంఖ్య పెరుగుతోంది. బ్రిటీష్ పాలనలో కొడైకెనాల్, ఊటీ ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తుల నివాసానికి అనుమతిచ్చారు. కానీ నేడు ఎలాంటి ఆంక్షలు లేవు. ఇతర నగరాల మాదిరిగానే ప్రజలు కొడైకెనాల్, ఊటీలో స్థిరపడుతున్నారు. కొడైకెనాల్, ఎలివాల్ జలపాతం వ్యూ పాయింట్ వద్ద 2022, 2024 సంవత్సరాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. చిత్తరేవు, తడియన్ కాటేజీల మధ్య రహదారిపై ప్రతి ఏటా వర్షాకాలంలో కొండచరియలు విరిగిపడుతున్నాయి. మున్నార్, కుములి వంటి ప్రదేశాల్లో కొత్త భవనాల నిర్మాణానికి అనుమతి లేదు. కానీ, కొడైకెనాల్, ఊటీలో మాత్రం అలాంటి కఠినమైన నిబంధనలు పాటించడం లేదు. కొత్తగా ఇళ్ల నిర్మాణానికి అనుమతివ్వరాదు. వయనాడు విలయం చేసిన హెచ్చరికను ప్రభుత్వం గ్రహించాలి' అని సూచించారు. నీలగిరి జిల్లా గూడలూరు సమీపంలోని కోకల్‌లో భూమి, ఇళ్లపై పగుళ్లు ఏర్పడిన ప్రాంతాలను కేంద్ర భూగర్భ శాఖ నిపుణులు పరిశీలించారు. 20 రోజులు అక్కడే వుండి మొత్తం అధ్యయనం చేయనున్నారు. కొక్కల్ ప్రాంతంలో జూన్ 27, 28 తేదీల్లో కురిసిన భారీవర్షాల సమయంలో, 'ఒకటిన్నర సెంట్'గా పిలిచే నివాస ప్రాంతాల్లోని ఇళ్లు, నర్సింగ్ హోమ్ భవనాలు పగుళ్లు ఏర్పడి దెబ్బతిన్నాయి. ఆ పగుళ్లు రోజురోజుకు పెరుగుతుండడంతో గత వారం కేంద్ర జియాలజీ శాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

నిజం గెలిచింది: ఆప్

న్యూఢిల్లీ: మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సత్యాన్ని దక్కిన విజయంగా ఆమ్ ఆద్మీ పార్టీ అభివర్ణించింది. జైలులో ఉన్న పార్టీకి చెందిన ఇతర నేతలకు కూడా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. "దిల్లీ విద్యా విప్లవ వీరుడు మనీశ్ కు బెయిల్ లభించడం వల్ల ఈ రోజు దేశమంతా సంతోషంగా ఉంది. గత 530 రోజులుగా సిసోడియాను జైల్లో ఉంచారు. పిల్లలకు మంచి భవిష్యత్తును అందించడమే మనీశ్ చేసిన నేరమా?" అని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా కేంద్రంపై ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. మరోవైపు దీనిపై దిల్లీ విద్యాశాఖ మంత్రి అతిశీ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్నారు. గతంలో మనీశ్ సిసోడియా శంకుస్థాపన చేసిన ఓ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అతిశీ శుక్రవారం హాజరయ్యారు. ఈసందర్భంగా సిసోడియాకు బెయిల్ మంజూరైన విషయాన్ని ఆమె ప్రస్తావించారు. "ఈ రోజు నిజం గెలిచింది. దిల్లీ విద్యార్థులు గెలిచారు. పేద పిల్లలకు సిసోడియా మెరుగైన విద్యను అందించడం, వారికి ఉజ్వల భవిష్యత్తు కల్పించడం కొందరికి నచ్చలేదు. అందుకే తప్పుడు కేసులో జైలుకు పంపించారు. కానీ, ఇప్పుడు ఆయనకు న్యాయం జరిగింది" అని చెబుతూ ఉద్వేగానికి లోనయ్యారు.

పంజాబ్ సీఎం హర్షం

మనీశ్ సిసోడియాకు బెయిల్ లభించడాన్ని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌లు సత్యానికి దక్కిన విజయంగా అభివర్ణించారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. "సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వ నియంతృత్వానికి చెంపపెట్టు. మనీశ్ జీవితంలో 17 నెలలు జీవితంలో నాశనం అయ్యాయి. దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, సత్యేందర్ జైన్ కు కూడా త్వరలోనే న్యాయం జరిగి జైలు నుంచి విడుదలవుతారని ఆశిస్తున్నాం. ఈ తీర్పు ఆప్‌కు పెద్ద బూస్ట్" అని పేర్కొన్నారు. అలాగే మనీశ్‌కు బెయిల్ లభించినందుకు సంతోషంగా ఉందని ఆప్ ఎంపీ స్వాతీ మాలీవాల్ తెలిపారు. దిల్లీ ప్రభుత్వానికి మనీశ్ నాయకత్వం వహించి, బాగా పని చేస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీత 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'కొన్నిసార్లు న్యాయం ఆలస్యం కావొచ్చేమో కానీ అన్యాయం మాత్రం జరగదు' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మరీ ఆనందపడొద్దు: బీజేపీ

మరోవైపు ఆప్ నేతల విమర్శలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. బెయిల్ వచ్చిందని మరీ ఆనందపడొద్దని అనుచిత వ్యాఖ్యలు చేసింది "కోర్టు తీర్పులను బీజేపీ గౌరవిస్తుంది. కానీ, బెయిల్ వచ్చినంతమాత్రాన కేసు నుంచి విముక్తి లభించినట్లు కాదు. ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. దీనిపై దర్యాప్తు జరుగుతోంది. సాక్ష్యాలు, నిజాలు బయటకు వస్తాయి" అని బీజేపీ నేతలు ఆప్‌పై విమర్శలు చేశారు.

శరద్ పవార్ ఎన్‌సీపీ యాత్ర ప్రారంభం



పూణె : మహారాష్ట్రలో శరద్ పవార్ నేతృత్వంలోని ప్రతిపక్ష నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పీ) శుక్రవారం 'శివస్వరాజ్య యాత్ర'ను ప్రారంభించింది. రాష్ట్రంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం దాని ప్రచారంలో భాగంగా అధికార ఎన్‌సీపీ తన యాత్రను ప్రారంభించిన ఒక రోజు తర్వాత ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. పూణె జిల్లాలోని జున్నార్ తహసీల్‌లోని పురాణ మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మస్థలమైన చారిత్రాత్మక శివనేరి కోట నుంచి ఎన్‌సీపీ (ఎస్‌పీ) యాత్ర ప్రారంభమైంది. ఇక్కడ శివనేరి కోట వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశీర్వాదం తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావాలనే సంకల్పంతో మేము మా యాత్రను ప్రారంభిస్తున్నామని మహారాష్ట్ర ఎన్‌సీపీ అధ్యక్షుడు జయంత్ పాటిల్ ఈ సందర్భంగా ప్రకటించారు. అక్టోబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రంలో శివసేన-బీజేపీ-ఎన్‌సీపీ ప్రభుత్వం సృష్టించిన అవినీతి, గందరగోళాన్ని వారు యాత్రతో (శివాజీ మహారాజ్ స్వయం పాలన స్ఫూర్తితో) బయటపెడతారని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత మహారాష్ట్ర ప్రజలు ఎన్‌సీపీ(ఎస్‌పీ), కాంగ్రెస్, శివసేనతో కూడిన ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) వెనుక సమీకరించడం స్పష్టంగా కనిపిస్తోందని రాష్ట్ర మాజీ మంత్రి నొక్కి చెప్పారు. 'మా నాయకులు, షిరూర్ (పుణె జిల్లా) నుంచి లోక్‌సభ ఎంపీ అమోల్ కోల్హే, ఇతర కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా వెళ్లి ప్రజలను చేరుకుంటారు' అని పాటిల్ చెప్పారు.

భారత్-బంగ్లా సరిహద్దుపై ఉన్నతస్థాయి కమిటీ

న్యూఢిల్లీ: అల్లర్లతో అట్టుడికిన బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు జరుగుతుండంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. సరిహద్దులో నెలకొన్న పరిస్థితులను సమీక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో భారతీయులు, హిందువులు, ఇతర మైనారిటీల భద్రతను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఈ కమిటీ నియమించినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. 'బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుపై ప్రస్తుత పరిస్థితిని సమీక్షించడానికి మోదీ ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో ఉన్న భారతీయులు, హిందువులతోపాటు ఇతర మైనారిటీ వర్గాల భద్రతకు సంబంధించి అక్కడి ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు కమిటీ సంప్రదింపులు జరుపుతుంది' అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో దక్షిణ బెంగాల్, త్రిపుర విభాగాల బీఎస్ఎఫ్ ఐజీ స్థాయి అధికారులు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనలతో అట్టుడికిన బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైన విషయం తెలిసిందే. ప్రధానమంత్రి హోదాకు సమానమైన ముఖ్య సలహాదారుగా వ్యవహరిస్తోన్న యూనస్... పౌరుల భద్రతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. వారిపై దాడుల్ని ఆపడం ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు.

నివాసం చికాగోలో... జీతం గుజరాత్‌లో...

గాంధీనగర్: దేశానికి గుజరాత్ మోడలే ఆదర్శమని కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు తరచూ చెబుతుంటారు. కానీ అమెరికాలోని షికాగోలో నివసిస్తూ ఓ ఉపాధ్యాయురాలు గుజరాత్‌లో ప్రతినెలా వేతనం తీసుకుంటున్నారు. అలా ఒకటి రెండు మాసాలు కాదు.. ఏకంగా ఎనిమిదేళ్లుగా ఆమె జీతం తీసుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా... ఆమెపై చర్యలు తీసుకోలేదు. బనస్‌కాంతా జిల్లా అంబాజీ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలిగా భవనాబెన్ పటేల్ గతంలో విధులు నిర్వహించారు. 2013లో ఆమె షికాగో వెళ్లిపోయారు. ఆమె గ్రీన్ కార్డు కూడా పొందారు. దీంతో ఏడాదికి ఒకసారి లేదా రెండేళ్లకు ఒకసారి గుజరాత్‌కు వస్తారు. ప్రత్యేకించి దీపావళి పండగను పురస్కరించుకుని భవనాబెన్ పటేల్ వస్తుంటారు. పండగ సమయం కావడంతో స్కూళ్లకు ప్రభుత్వం సెలవులు ఇస్తుంది. దీంతో ఆమెను ఇప్పటి వరకు కనీసం చూడ లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఆమె దేశంలో లేకున్నా... విధులకు హాజరుకాకున్నా... ఆమె పేరు మాత్రం రిజిస్టరులో ఇంకా కొనసాగుతోందని ఆ పాఠశాల సిబ్బంది తెలిపారు. ప్రతి నెలా వేతనం మాత్రం ఆమె బ్యాంక్ ఖాతాలోకి వెళుతోంది. ఈ విషయాన్ని పాఠశాలలోని ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఆమెపై ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదు. పాఠశాల ఇన్‌చార్జీ ఉపాధ్యాయులు పరుల్‌బెన్ మాట్లాడుతూ 2013లోనే భావనాబెన్ పటేల్ అమెరికా వెళ్లిపోయారని తెలిపారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఈ అంశంపై ప్రాథమిక విద్యాశాఖ అధికారి స్పందిస్తూ భావనాబెన్ పటేల్... చివరిసారిగా జనవరి 2023లో పాఠశాలను సందర్శించారని తెలిపారు. ఈ ఏడాది నుంచి వేతనం లేని సెలవులో ఆమె ఉన్నారని చెప్పుకొచ్చారు.

బుద్ధదేవ్‌కు ఎంపీలు, మంత్రుల నివాళి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ వద్ద మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య భౌతికకాయానికి బెంగాల్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు నివాళులర్పించారు. అశ్రునయనాలతో సీపీఎం కార్యకర్తలు, ఆయన అభిమానులు 'జోహార్ బుద్ధదేవ్' అని నినదిస్తూ అనుసరింగా శుక్రవారం ఉదయం మార్చురీ నుంచి అసెంబ్లీకి బుద్ధదేవ్ భౌతికకాయాన్ని రాష్ట్ర అసెంబ్లీ వద్దకు తీసుకొచ్చారు. బుద్ధదేవ్ భౌతికకాయంతో పాటు ఆయన భార్య మీరా, కుమారుడు సుచేతన్ ఉన్నారు. అసెంబ్లీ వద్ద

టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ, కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్, విద్యుత్ శాఖ మంత్రి అరూప్ బిస్వాస్, వ్యవసాయ శాఖ మంత్రి సోవాందేవ్ చటోపాధ్యాయ, స్పీకర్ బిమన్ బందోపాధ్యాయ, డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ, డీజీపీ రాజీవ్ కుమార్, కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ తదితరులు మాజీ సీఎం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అసిత్ మిత్రా, లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బోస్, సీపీఎం సీనియర్ నాయకులు సూర్యకాంత మిశ్రా, రబిన్ దేవ్ కూడా అసెంబ్లీ వద్ద బుద్ధదేవ్‌కు నివాళులర్పించారు. అనంతరం బుద్ధదేవ్ భౌతికకాయాన్ని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యాలయం ముజఫర్ అహ్మద్ భవన్‌కు తరలించారు.

శ్వాసకోశ సమస్యలు, వృద్ధాప్యానికి సంబంధించిన దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న భట్టాచార్య గురువారం ఉదయం దక్షిణ కోల్‌కతా నివాసంలో తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని రాత్రికి రాత్రే మార్చురీకి తరలించారు.

ప్రతిపక్షాలపై పక్షపాత ధోరణి ఎందుకు?

రాజ్యసభ చైర్మన్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ : రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్, ప్రతిపక్ష పార్టీల మధ్య గందరగోళ సంబంధాలు శుక్రవారం మరోసారి తెర పైకి వచ్చాయి. చైర్మన్ మొత్తం ప్రతిపక్షాలపై 'పక్షపాత' ధోరణితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. 'ఆమోదించలేని' స్వరం, ధన్కర్ చూపిన అగౌరవానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేసిన వెంటనే, కాంగ్రెస్ విలేకరుల సమావేశం నిర్వహించింది. ఎగువ సభలో ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యతను చైర్మన్ ఇవ్వడం లేదని పేర్కొంది. 'చైర్మన్ వ్యవహారశైలి పక్షపాతంగా ఉందని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. రాజ్యసభ అనేది ఇతర శాసనసభలకు ప్రమాణాలను నిర్దేశించే సభ. ఆ సభలో చైర్మన్ పక్షపాతంగా చూడకూడదు. కాంగ్రెస్ మాత్రమే అలా భావించడం లేదు. అన్ని ప్రతిపక్షాలు ఆయన ప్రవర్తన పక్షపాతంగా ఉందని భావిస్తున్నాయి' అని కాంగ్రెస్ నాయకుడు అజయ్ మాకెన్ విలేకరుల సమావేశంలో అన్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని, రాజ్యసభలో విపక్షాల స్వరం ప్రతిధ్వనించకపోతే మరెక్కడా ప్రతిధ్వనిస్తుందని ఆయన ప్రశ్నించారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఉప నాయకుడు ప్రమోద్ తివారీ మాట్లాడుతూ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను మాట్లాడనివ్వడం లేదని, సభ చైర్మన్ తరచూ అంతరాయం కలిగిస్తున్నారని, మైక్ కట్ చేస్తున్నారని మండిపడ్డారు. 'ఇది ఒక పార్టీకి సంబంధించినది కాదు. రెండు మూడు రోజుల క్రితం ఘనశ్యామ్ తివారీ ప్రతిపక్ష నాయకుడిని ఉద్దేశించి ఇలాంటి పదాలు వాడారు, అవి సరైనవి కావు. అవమానకరమైనవి. ఆమోదయోగ్యం కానివి. మేము ప్రివిలేజ్ మోషన్ కోసం నోటీసు ఇచ్చాం. దానిపై రూలింగ్‌ను తెలుసుకోవాలనుకున్నాం. రూలింగ్ రాలేదు. అది లిఖితపూర్వకంగా ఉండాలి' అని ఆయన అన్నారు. అంతకుముందు, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ, ఇతర సీనియర్ నాయకులతో ప్రతిపక్షం సభ నుంచి వాకౌట్ చేసింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్, చైర్మన్ ధన్కర్ మధ్య ఎగువ సభలో తీవ్ర వాగ్వాదం జరిగిన తర్వాత వాకౌట్ జరిగింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్) జైరాం రమేశ్ విలేకరులతో మాట్లాడుతూ అంతకుముందు ఘనశ్యామ్ తివారీ సభలో ప్రతిపక్ష నాయకుడిని అవమానించారని అన్నారు. 'విషయమేమిటంటే, ఖర్గేపై తివారీ తీవ్రమైన ఆరోపణలు చేశారని, దానిని రికార్డుల నుంచి తొలగించాలని మేము కోరుకున్నాం' అని అన్నారు.

'ఎస్సీల క్రీమీలేయర్' పై తప్పుదోవ పట్టించొద్దు

కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘవాల్

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీలలో క్రీమీలేయర్‌ను గుర్తించేందుకు రాష్ట్రాలు తప్పనిసరిగా కసరత్తు చేపట్టాలని, వారిని రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి మినహాయించడంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యక్తపర్చిన అభిప్రాయాలపై సమాజాన్ని తప్పుదోవ పట్టించవద్దని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుక్రవారం ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో మేఘవాల్ అనుబంధ ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ/ఎస్టీ కోటాలో క్రీమీలేయర్ కు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పుపై శివసేన (యూబీటీ) సభ్యుడు భౌసాహెబ్ వాక్‌చౌరే లేవనెత్తిన అంశంపై మంత్రి మాట్లాడుతూ..."ఎస్సీ/ఎస్టీల ఉప-వర్గీకరణలో క్రీమీలేయర్ ప్రస్తావన అనేది సుప్రీంకోర్టు న్యాయమూర్తి పరిశీలన మాత్రమేనని... నిర్ణయంలో భాగం కాదు. సభ్యుడు సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయకూడదు" అని మేఘవాల్ అన్నారు. వివిధ రాష్ట్రాల్లోని రాజ్యసభ లేదా శాసనమండలిలో ఎస్సీ/ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగంలో ఎలాంటి నిబంధన లేదని మేఘవాల్ స్పష్టం చేశారు. రాజ్యసభలో ఎస్సీ/ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని కూడా వెల్లడించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 332 ప్రకారం, రాష్ట్ర శాసనసభలలో వారి జనాభా నిష్పత్తిలో ఎస్సీ, ఎస్టీలకు సీట్లు రిజర్వ్ చేయబడతాయని న్యాయ మంత్రి చెప్పారు.

మీ స్వరం ఆమోదయోగ్యంగా లేదు

రాజ్యసభలో జయా బచ్చన్ వర్సెస్ ధన్కర్

జయకు మద్దతుగా విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ : రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్ మధ్య శుక్రవారం పార్లమెంటులో వాగ్వాదం చోటుచేసుకుంది. మరోసారి జయా బచ్చన్ పేరును జయా అమితాబ్ బచ్చన్‌గా రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ సంబోధించడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ధన్కర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నాకు పాఠాలు చెప్పొద్దు' అని తీవ్రంగా స్పందించారు. దాంతో చైర్మన్ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేయడంతో సభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. చైర్మన్ వైఖరిని నిరసిస్తూ విపక్షాలు వాకౌట్ చేశాయి. జయా బచ్చన్‌కు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ మద్దతుగా నిలిచారు. అసలు ఏం జరిగిందంటే... జయా అమితాబ్ బచ్చన్ మాట్లాడాలని కోరుతూ చైర్మన్ ధన్కర్ పిలిచారు. ఆ సమయంలో లేచిన జయా... తనకు జయా అమితాబ్ బచ్చన్ అని పిలువాలని లేదన్నారు. తాను ఒక ఆర్టిస్టును అని, శరీర భాషను అర్థం చేసుకోగలనని, మీ స్వరం ఆమోదయోగ్యంగా లేదని చైర్మన్‌ను ఆమె తప్పుపట్టారు. దీంతో చైర్మన్ జగదీప్ ధన్కర్ సీరియస్ అయ్యారు. ఇక చాలు. నువ్వు ఎవరైనా కావొచ్చు. కానీ సభా మర్యాద పాటించాలని, డైరెక్టర్ ఆధీనంలోనే నటులు ఉంటారన్నారు. నువ్వు సెలబ్రిటీవే కావొచ్చు. నాకే గుర్తింపు ఉందన్న భావనలోనే ఉండకండని తెలిపారు. తాము కూడా గుర్తింపుతోనే ఈ స్థాయికి వచ్చినట్లు ధన్కర్ తీవ్ర స్వరంలో చెప్పారు. కాగా, జయా అమితాబ్ బచ్చన్ అని పిలిచినందుకు క్షమాపణలు చెప్పాలని ఎంపీ కోరారు.

ఇది మహిళలకు అవమానకరం : జయా బచ్చన్

జయా బచ్చన్ పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు పార్లమెంటులో మాట్లాడిన తీరు మహిళలకు అగౌరవంగా ఉందన్నారు. 'చైర్మన్ ఉపయోగించిన స్వరాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. మేం పాఠశాల విద్యార్థులం కాదు. మాలో కొందరు సీనియర్ సిటిజన్లు కూడా ఉన్నారు. ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు నిల్చున్న సమయంలో ఆయన మాట తీరు బాధించింది. మైక్ కట్ చేశారు. అలా ఎలా ప్రవర్తిస్తారు? మీరు సెలబ్రిటీ అయితే ఏంటి నేను పట్టించుకోనంటూ తీవ్ర పదజాలం వాడుతుంటారు. ఆయన పట్టించుకోవాలని నేను అడగడం లేదు. ఐదోసారి నేను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. నాకు తెలీదా ఏం మాట్లాడాలో? ఇలాంటి ప్రవర్తన గతంలో ఎన్నడూ చూడలేదు. దీనిపై క్షమాపణలు చెప్పాలి' అని ఆమె డిమాండ్ చేశారు. ఆ సమయంలో ఆమె వెంట సోనియా గాంధీ కూడా ఉన్నారు. ఇటీవల రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణసింగ్.. 'జయా అమితాబ్ బచ్చన్' మాట్లాడాలంటూ ఆహ్వానించారు. దీనిపై జయాబచ్చన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'జయా బచ్చన్ అంటే సరిపోతుంది' అంటూ పేర్కొన్నారు. 'రికార్డుల్లో మీ పూర్తి పేరు ఇలానే ఉంది' అంటూ చెప్పగా.. 'మహిళలకు స్వతహాగా గుర్తింపు లేదా' అంటూ ఆ రోజు ఆమె అసహనం వ్యక్తం చేశారు. జగదీప్ ధన్‌కర్, జయా బచ్చన్ మధ్య జరిగిన చర్చకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

ప్రతిపక్ష సభ్యుల వాకౌట్

జయా బచ్చన్, చైర్మన్ ధన్కర్ మధ్య మాటల యుద్ధం తర్వాత కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ నేతృత్వంలోని ప్రతిపక్ష ఎంపీలు బచ్చన్‌కు మద్దతుగా వాకౌట్ చేశారు. సభలో చర్చల సమయంలో మాట్లాడటానికి అనుమతించడం లేదని వారు నొక్కి చెప్పారు. ప్రతిపక్ష నేతలు సోనియా గాంధీ, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన డెరెక్ ఓబ్రెయిన్ నేతృత్వంలో పార్లమెంటు వెలుపల సమావేశమయ్యారు. జయా బచ్చన్‌తో పాటు అనేక మంది సభ్యులు మాట్లాడారు. పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలను పదే పదే అవమానించారని, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విలేకరులతో అన్నారు. శివసేన (యూబీటీ) కి చెందిన ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ జయా బచ్చన్‌కు 'అపారమైన పార్లమెంటరీ అనుభవం ఉంది. ఉపరాష్ట్రపతి కంటే ఎక్కువ' అని చెప్పారు. టీఎంసీ మరో సభ్యురాలు డోలా సేన్ స్పందిస్తూ, జయా బచ్చన్ నాలుగు సార్లు ఎంపీ, గౌరవం పొందాలని అన్నారు.

క్విట్ కార్పొరేట్

రాష్ట్రవ్యాప్తంగా హోరెత్తిన నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సహజ వనరులను కొల్లగొడుతూ, మరోపక్క పేద, మధ్య తరగతి వర్గాల శ్రమను దోపిడీ చేస్తూ దేశాన్ని పట్టిపీడిస్తున్న బహుళజాతి కంపెనీలను తరిమికొట్టాలని రైతు, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. క్విట్ కార్పొరేట్ పేరుతో కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపులో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. కేంద్ర సంస్థల కార్యాలయాల వద్ద, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లల్లో క్విట్ కార్పొరేట్ ప్లకార్డులు చేతబూని కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో నినదించారు. లక్షల కోట్ల సంపదను ప్రభుత్వాలు కార్పొరేట్‌లకు దోచిపెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బడాబాబుల అక్రమ ఆస్తులను జాతీయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెట్టే వ్యవసాయ రంగ రక్షణకు అందరూ ఐక్య ఉద్యమానికి సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కార్మిక, కర్షక సంఘాల నేతృత్వంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో జరిగిన నిరసన దీక్ష శిబిరానికి అధ్యక్ష వర్గంగా మల్నీడి యల్లమందరావు, పగడాల ఆంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల సమాఖ్య నేత, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశం నుంచి విదేశీ, స్వదేశీ బహుళ జాతి కంపెనీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన నాలుగు నల్ల చట్టాలను రద్దు చేసినప్పటికీ, పాలకులు పరోక్షంగా అదే విధానాలను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ రంగంలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ఇతర అన్ని రంగాల్లోనూ బహుళ జాతి కంపెనీల ప్రవేశంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోని పక్షంలో రాబోయే రోజుల్లో కార్మిక, కర్షకుల నేతృత్వంలో పెద్ద ఎత్తున మరో ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావటాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో రైతు సంఘాల రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, బుడ్డి రమేష్, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్, కార్మిక సంఘం నాయకులు మూలి సాంబశివరావు, సింహాద్రి ఝాన్సీ, డి.హరినాథ్ తదితరులు ప్రసంగించారు.

కార్పొరేట్ల సంపదలో 10 శాతం వాటాను కష్టజీవులకు పంచాలి : జి.ఓబులేసు

దేశాన్ని దోచుకుతింటున్న కార్పొరేట్ల సంపదలో 10 శాతం వాటాను పేదలు, కష్టజీవులకు పంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఉన్న ఆస్తులు, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించడం, వాళ్ల ఆదాయాన్ని పెంచడం తప్ప మరో కార్యక్రమాన్ని ఆయన చేపట్టలేదని విమర్శించారు. కార్మిక హక్కులు కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ, చిన్నం పెంచలయ్య, జె.విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూటీవో ఒప్పందాలను రద్దు చేయండి : దేగా ప్రభాకర్

దేశ సంపదను కొల్లగొడుతున్న, వ్యవసాయ రంగాన్ని కబళిస్తున్న కార్పొరేట్ కంపెనీలను దేశం నుంచి తరిమికొట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఏలూరు విజయ విహార్ సెంటర్‌లోని రిలయన్స్ షాపింగ్ మాల్ వద్ద రైతు సంఘాల సమన్వయ కమిటీ, కార్మిక సంఘాల అధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి (స్ఫూర్తి భవనం) దేగా ప్రభాకర్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం (ఆంధ్ర ప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.కె బాషా, ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో

రాజమహేంద్రవరం హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద జరిగిన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు తదితరులు ప్రసంగించారు. గత పదేళ్లలో మోదీ అనుసరించిన కార్పొరేట్ అనుకూల విధానాలు భారతదేశంలో పేదరికం, నిరుద్యోగాన్ని పెద్ద ఎత్తున పెంచాయని, అసమానతలు విపరీతంగా పెరిగి ప్రజల ఆదాయాలు పడిపోయాయని, రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని విమర్శించారు.

పత్తికొండలో

వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను, అటవీ సంపదను, ప్రకృతి వనరులను అంబాని, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు మోదీ కట్టబెడుతున్నారని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.రామచంద్రయ్య విమర్శించారు. పత్తికొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు కారన్న, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లాలో

కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు మారుమ్రోగాయి. గుంటూరు శంకర విలాస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, రైతు సంఘ నేతలు పచ్చల శివాజీ, ఈమని అప్పారావు, ఉల్లిగడ్డ నాగేశ్వరరావులు తదితరులు పాల్గొన్నారు. తాడికొండ పోస్టాఫీస్ వద్ద జరిగిన ఆందోళనలో రైతు నాయకులు ముప్పాళ్ల శివశంకరరావు, రామినేని నర్సింహారావు, పెదకాకాని ఎన్టీఆర్ ధర్నా చౌక్‌లో పుప్పాల సత్యనారాయణ, పాశం రామారావు, నన్నపనేని శివాజీ, తాడేపల్లి ఉండవల్లి సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రైతు సంఘ మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో

కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు భీమవరంలో భారీ ప్రదర్శన నిర్వహించి ప్రకాశం చౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఎన్వీ గోపాలన్, వైవీ ఆనంద్, జక్కంశెట్టి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. కర్నూలులో కె.జగన్నాథం, ధర్మవరంలో ఎ.కాటమయ్య, అన్నమయ్య జిల్లాలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర నేత పి.జమలయ్య, వినుకొండలో ఉలవపూడి రాము తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు.

కార్పొరేట్లకు మోదీ సర్కారు ఊడిగం

రావుల వెంకయ్య విమర్శ

మథుర: సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా శుక్రవారం దేశవ్యాప్తంగా 'క్విట్ కార్పొరేట్' పేరుతో పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. రాజధాని దిల్లీ సహా అన్ని రాష్ట్రాల్లో రైతు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు జరిపారు. జిల్లా కలెక్టర్లకు వినతులతో కూడిన విజ్ఞాపన పత్రాలు అందించారు. నిరసనల్లో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని మథురలో భారీ ర్యాలీ జరిగింది. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, కిసాన్ సభ జాతీయ కోశాధికారి చిత్తర్ సింగ్ తదితరులు నాయకత్వం వహించారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ... కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. నాడు బ్రిటిష్ వారిని తరిమికొట్టినట్లుగా కార్పొరేట్లను కూడా తరిమికొట్టి వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.48 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయానికి కేవలం రూ.1.53 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారని, దేశ జనాభాలో సింహభాగం ఉన్న వ్యవసాయదారులకు బడ్జెట్‌లో 3.15 శాతం మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. రైతుల విత్తనాలకు ఇచ్చే సబ్సిడీలను కుదించారన్నారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలని, రైతులకు పెన్షన్లు మంజూరు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులపై అనవసర భారం వేయరాదని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు కనీస మద్దతు ప్రకటించి...దానికి చట్టబద్ధత కల్పించాలన్నారు. రైతులు సహా అన్ని వర్గాలను విస్మరించిన మోదీ సర్కారు...కార్పొరేట్ మిత్రులకు మాత్రం దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో భారీగా రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌కు ఎయిర్‌ఇండియా విమానాల నిలిపివేత

న్యూదిల్లీ: ఇజ్రాయిల్- హమాస్ యుద్ధం, మధ్యలో హెజ్‌బొల్లా, ఇరాన్ జోక్యంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయిల్ రాజధాని టెల్ అవీవ్‌కు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు భారత విమానయాన సంస్థ ఎయిర్‌ఇండియా ప్రకటించింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించి సర్వీసుల పునరుద్ధరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు పూర్తిగా డబ్బులు తిరిగి ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. అంతకుముందు ఆగస్టు 2 నుంచి 8వ తేదీ వరకు దిల్లీ-టెల్ అవీవ్ మధ్య విమాన సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ఎయిర్‌ఇండియా ప్రకటించిన సంగతి తెలిసిందే. దిల్లీ- టెల్ అవీవ్ మధ్య వారానికి నాలుగు సర్వీసులను ఎయిర్‌ఇండియా నడుపుతోంది. అయితే, గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి జరిపిన తర్వాత ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో దాదాపు ఐదు నెలల పాటు టెల్ అవీవ్‌కు విమాన సర్వీసులను ఈ ఎయిర్‌లైన్ నిలిపివేసింది. ఆ తర్వాత పరిస్థితులు కాస్త సద్దుమణిగాక మళ్లీ సర్వీసులు పునరుద్ధరించింది. హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియా ఇరాన్‌లో హత్యకు గురికావడం, హమాస్ సైనిక విభాగాధిపతి మహమ్మద్ డెయిఫ్‌ను హతమార్చినట్లు ఇజ్రాయిల్ ప్రకటించడం, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సీనియర్ మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్ కూడా ఇజ్రాయిల్ దాడిలో మృతిచెందడంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే ఇజ్రాయిల్ భూభాగం దిశగా లెబనాన్ రాకెట్లను ప్రయోగించింది.

వయనాడ్‌కు విరాళం కోసం 3 గంటల భరతనాట్యం

తిరువనంతపురం: కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం తమిళనాడుకి చెందిన ఓ బాలిక(13) తన వంతు సాయం అందించేందుకు అనూహ్య నిర్ణయం తీసుకుంది. తనకు వచ్చిన కళతో విరాళాలు సేకరించింది. ఆ నగదును కేరళ సీఎం పినరయి విజయన్‌కి అందించి ఎనలేని స్ఫూర్తిని నింపింది. హరిణి శ్రీ అనే బాలిక వయనాడ్ దుర్ఘటన జరిగినప్పటి నుంచి పేపర్లు, టీవీల్లో విషాదకర వార్తలు చూస్తూ తీవ్ర మనోవేదనకు గురైంది. బాధిత కుటుంబాలకు తన వంతుగా ఏదైనా చేయాలని ఓ సాహస నిర్ణయం తీసుకుంది. 3 గంటలపాటు నిరంతరాయంగా భరతనాట్యం చేసి రూ.15 వేల విరాళాలు సేకరించింది. ఆ మొత్తాన్ని సీఎండీఆర్‌ఎఫ్‌కి అందించింది. విషయం తెలుసుకున్న సీఎం విజయన్ బాలికను తన కార్యాలయానికి పిలిపించుకొని ఆమె భరత నాట్య ప్రదర్శనను చూశారు. చిన్నవయసే అయినా అంత పెద్ద మనసుతో అతి కష్టమైన పని చేసి విరాళాలు సేకరించడంపై ఆయన భావోద్వేగానికి గురయ్యారు. బాలికను అభినందించి... కాసేపు ముచ్చటించారు.

వయనాడ్ బాధితులకు సీపీఐ సాయం

తిరుపతి నుంచి నిత్యావసరాల లారీ

విశాలాంధ్ర-తిరుపతి: వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండు చేశారు. కేరళలోని వరద ముంపు ప్రాంతాల్లో శని, ఆదివారాలు తాను పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. వరద బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వయనాడ్ వరద బాధితులను ఆదుకోవడానికి ఏపీ సీపీఐ అధ్వర్యంలో లారీ బియ్యంతో పాటు దుస్తులు, ఇతర సామగ్రి పంపుతున్నట్లు నారాయణ తిరుపతిలో తెలియచేశారు. వయనాడ్ బాధితుల కోసం రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ అధ్వర్యంలో విరాళాలు సేకరించి పంపుతున్నామన్నారు. వయనాడ్ వరద బాధితులను ఆదుకోవడానికి చాలామంది స్వచ్ఛందంగా ముందుకు రావడం హర్షణీయమన్నారు. వయనాడ్ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపడం బాధాకరమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం... ఇతర పార్టీలు అధికారంలో ఉండే రాష్ట్రాలకు మరో న్యాయం చేస్తున్నారని నారాయణ విమర్శించారు. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో తమిళనాడు, కేరళ రాష్ట్రాలపై మోదీ చాలా వివక్ష చూపుతున్నారన్నారు. ప్రధానమంత్రిగా అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, తిరుపతి నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, సీపీఐ నేతలు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గుడ్ మార్నింగ్' బదులు 'జైహింద్'

హర్యానా ప్రభుత్వం నిర్ణయం

చండీగఢ్: హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15వ తేదీ నుంచి పాఠశాలల్లో గుడ్ మార్నింగ్‌కు బదులు జైహింద్ చెప్పుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టరేట్ ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు టీచర్లకు, తోటి స్నేహితులకు పలకరింపుగా 'గుడ్ మార్నింగ్'కు బదులుగా 'జై హింద్' అని చెప్పాలని పాఠశాల విద్యా డైరెక్టరేట్ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల్లో చిన్ననాటినుంచే దేశభక్తి, దేశంపై గౌరవం, ఐక్యతా భావాలు పెంపొందించాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయజెండా ఎగురవేసే ముందు నుంచి ఈ సూచనలు అమలుచేయనున్నట్లు వెల్లడించారు. 'దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో ప్రజల్లో ఐక్యతను పెంపొందించడానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటుచేశారు. జైహింద్ అనే నినాదంతో ప్రజలను ఒక్కటి చేశారు. మన నాయకుల అవిశ్రాంత కృషితో స్వాతంత్ర్యం సాధించారు. ఆ సమయంలో నాయకులు ఒకరికి ఒకరు 'జై హింద్' చెప్తూ పలకరించుకునేవారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఈ పలకరింపులను అమలు చేయడం వల్ల విద్యార్థుల్లో దేశభక్తి, ఐక్యత, క్రమశిక్షణ పెంపొందుతుంది. ఈ పదం దేశం గొప్పతనాన్ని ప్రతిరోజూ వారికి గుర్తు చేస్తోంది' అని విద్యాశాఖ పేర్కొంది.

ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

ఉభయసభలు నిరవధిక వాయిదా

న్యూదిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో అనేక కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా నీట్ లీకేజీ వ్యవహారం, రైల్వే భద్రత తదితర అంశాలు ఉభయ సభలను కుదిపేశాయి. పార్లమెంటు సమావేశాలు గత నెల 22 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి రోజు 2023-24 ఆర్థిక సర్వేను ఆర్థిక మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 23వ తేదీన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎన్డీయే కూటమి ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌పై ఉభయ సభల్లో వాడీవేడి చర్చ కొనసాగింది. చర్చ అనంతరం కేంద్ర బడ్జెట్‌కు సభ ఆమోదం తెలిపింది. ఇక ఈ సమావేశాలు ఆగస్టు 12వ తేదీ వరకూ కొనసాగుతాయని ప్రభుత్వం ముందే ప్రకటించినప్పటికీ ఉభయ సభలు ముందుగానే నిరవధికంగా వాయిదా పడ్డాయి.

అన్ని స్కూళ్లకు ఇంటర్‌నెట్: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాణ్యమైన విద్యాబోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు సహకారంతో అమలవుతున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు అమలు తీరుపై పాఠశాల విద్య అధికారులు, సంబంధిత ఏజెన్సీల ప్రతినిధులతో శుక్రవారం ఉండవల్లి నివాసంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేశ్... గత ప్రభుత్వ హయాంలో సాల్ట్ ప్రాజెక్టు అమలులో వెనుకబడటంపై కారణాలను తెలుసుకున్నారు. నాడు-నేడు, సాల్ట్ వంటి పథకాలపై గత ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసినట్లు కాగితాల్లో చూపుతోందని, అదే నిజమైతే గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2 లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. దీనిపై లోతైన విశ్లేషణ చేసి, నాణ్యమైన విద్య అందించి మెరుగైన ఫలితాల సాధనకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. రాబోయే అయిదేళ్లలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్‌నెట్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టీచింగ్ టూల్స్ అబ్జర్వేషన్, ఆబ్జెక్టివ్ ఓరియంటెడ్ బోధనా పద్ధతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ (ఎల్ఎఫ్ఇ) ప్రతినిధులకు సూచించారు. ఆయా ఏజెన్సీలు నిర్వహిస్తున్న ఎసెస్‌మెంట్, శిక్షణా కార్యక్రమాలు అర్థవంతంగా, ఫలితాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలని అన్నారు. ఇంటర్మీడియట్‌లో మార్కులకు బదులుగా గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సీఎం నుంచి ఎమ్మెల్యే వరకు ప్రజా ప్రతినిధులంతా మోడల్ పీటీఎం సమావేశాలకు హాజరై తల్లిదండ్రుల మనోగతాన్ని తెలుసుకుంటామని అన్నారు. ఈ సమీక్షలో పాఠశాల విద్య శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, పీడబ్ల్యూసీ ప్రతినిధులు సుచీంద్ర కుమార్, సోనాల్ శివగుండే, సునీత, కె.సురేష్ బాబు (ప్రథమ్), దత్తాత్రేయ, మజీద్ (ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్), వైభవ్ పాండే, నాగ సాయికృష్ణ (కైవల్య ఫౌండేషన్), సిద్దేష్ శర్మ (లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ) పాల్గొన్నారు.

'సుప్రీం'లో ఆమీర్ సినిమా ప్రదర్శన

ఇది అరుదైన సందర్భం: సీజేఐ

న్యూదిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం మరో అరుదైన సందర్భానికి వేదికైంది. బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్‌ను నేడు సుప్రీంకోర్టులో ప్రదర్శిస్తుండటమే అందుకు కారణం. సాయంత్రం 4.15 గంటల నుంచి ఈ సినిమా ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు ఆమిర్ ఖాన్, ఆ చిత్ర దర్శకురాలు కిరణ్ రావ్ సినిమా వీక్షించేందుకు సుప్రీంకోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సరదాగా మాట్లాడారు. 'కోర్టులో తొక్కిసలాట తరహా పరిస్థితిని నేను కోరుకోను. కానీ ఈరోజు ఇక్కడ ఆమిర్ ఉన్నారు' అని చమత్కరించారు. ఈ సినిమాను సీజేఐ, ఇతర న్యాయమూర్తులు, వారి కుటుంబాలు, ఇతర సిబ్బంది వీక్షించారు. తన చిత్రాలతో సామాజిక అంశాలను లేవనెత్తే ఆమిర్ సొంత బ్యానర్‌పై 'లాపతా లేడీస్' తెరకెక్కించారు. 2001లో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువ వధువులు రైలు ప్రయాణంలో తప్పిపోయిన ఘటన ఇతివృత్తంగా చిత్రాన్ని రూపొందించారు. లింగ సమానత్వాన్ని చాటిచెప్పే ఈ కామెడీ డ్రామా సినిమా... ఈ ఏడాది మార్చిలో విడుదలై సినీ ప్రముఖులు, విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైనా ఓటీటీలో సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది.

సీఎస్ నీరబ్‌తో నావికా దళాధికారి సర్దేశాయ్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత నావికా దళ ప్రధాన కేంద్రం (న్యూదిల్లీ) వైస్ అడ్మిరల్ ఏవై సర్దేశాయ్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో నావికాదళ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలపై ఇద్దరు చర్చించారు. రియర్ అడ్మిరల్ గిరీశ్ కె.గార్గ్ (వీఎస్ఎం), ఏపీ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా పాల్గొన్నారు.

జగన్‌కు రెడ్‌బుక్ భయం

నిమ్మల రామానాయుడు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కక్ష్యలు, కేసులు, వేధింపులు, హత్యలకు మారుపేరు వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. జగన్ పదేపదే రెడ్‌బుక్ గురించి కలవరిస్తున్నారని, తన పాలనలో జరిగిన అవినీతి బయట పడుతుందనే భయంతో ఏ రంగు చూసినా ఆయనకు ఎరుపు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ హింస, హత్యల గురించి జగన్ మాట్లాడుతుంటే రావణాసురుడు రామాయణం చెప్తున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. జగన్ పాలన అనే కంటే 144 సెక్షన్ పాలనంటే సరిగ్గా ఉంటుదని విమర్శించారు. అప్పటి ప్రతిపక్ష నాయకుల ఇంటికి దినపత్రిక కంటే ముందుగా పోలీసులను పంపి గృహ నిర్బంధంలో ఉంచిన సంగతి గుర్తులేదా అని ప్రశ్నించారు.

నంద్యాల జిల్లా సీతారామపురం గ్రామానికి చెందిన దళితుల 40 సెంట్లు భూమిని వైసీపీ నాయకుడు నారపరెడ్డి లీజుకు తీసుకుని, లీజు పూర్తయినా డబ్బు ఇవ్వకుండా, బెదిరింపులకు పాల్పడుతుంటే అడ్డుచెప్పిన ఆ గ్రామ పెద్ద ఇంటిపై దాడుల చేసిన సంగతి రికార్డులలో ఉన్నాయని, కుటుంబ తగదాల వల్ల సుబ్బారాయుడు మరణిస్తే దానికి రాజకీయ రంగు పులిమి టీడీపీకి అంటగట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నారని తెలిపారు. వినకొండ హత్యను సైతం టీడీపీ హత్యగానే ప్రచారం చేసి విఫలం చెందారని, అందువల్లే నంద్యాలలో ఈ డ్రామాకు తెరలేపారని అన్నారు. జగన్ తన ఉనికి కాపాడుకునేందుకే ఇలాంటి విషప్రచారం చేస్తున్నారని రామానాయుడు విమర్శించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.